PRGI REGD No.: TGTEL/26/A4986

ప్రభాత కిరణమ్
సత్యానికి వారధి

అమరావతి | సంపుటి : 01 | సంచిక : 034 | మంగళవారం | 28-07-2026 | పేజీలు : 08 | వెల: రూ.4/-
www.prabhathakiranam.com

Amaravathi | Volume : 01 | Issue : 034 | Tuesday | 28-07-2026 | Pages: 08 | Price : Rs.4/-
Circulated to Telangana | Published from Medchal Malkajgiri


2లో..



# భోగాపురం సిద్ధం

## మోదీ రాకకు గ్రాండ్ ప్లాన్

- ఉత్తరాంధ్రకు కలల రెక్కలు
- ప్రారంభోత్సవంపై సీఎం సమీక్ష



భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా విమానాశ్రయం ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. భద్రత, ట్రాఫిక్, అతిథుల స్వాగతం, సభా ఏర్పాట్లు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

### ఉత్తరాంధ్రకు గ్రోత్ ఇంజిన్

భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని చంద్రబాబు తెలిపారు. 2,703 ఎకరాల విస్తీర్ణంలో రూ.4,727 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఆధునిక సౌకర్యాలతో సిద్ధమైందన్నారు. 3,800 మీటర్ల రన్‌వేతో తొలి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించే సామర్థ్యం కలిగి ఉందని చెప్పారు. 500 ఎకరాల్లో ఏవియేషన్ హబ్, 136 ఎకరాల్లో ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటుతో ఉపాధి, పారిశ్రామిక, పర్యాటక రంగాలకు పెద్ద ఊతం లభిస్తుందని వివరించారు.

## శివానీ మృతి మిస్టరీ

- మూడు రోజుల క్రితమే సీఎంతో వేదికపై
- సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి •
- విద్యార్థులకు సీఎం పిలుపు
- ఫోరెన్సిక్‌కు సూసైడ్ నోట్ • అన్ని కోణాల్లో దర్యాప్తు

పోలవరం జిల్లాలో పదో తరగతి విద్యార్థిని ముర్రం శివానీ ఆత్మహత్య కేసు దర్యాప్తు వేగం పుంజుకుంది. ఇర్లపల్లి గ్రామానికి చెందిన శివానీ మృతి కేసును పోలీసులు అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నారు. ఘటనాస్థలికి చేరుకున్న ఏపీ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఏపీఎఫ్ఎస్ఎల్), క్లూస్ టీమ్‌లు కీలక ఆధారాలను సేకరించాయి. సంఘటనా స్థలంలో లభించిన సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు సీఐ నరేంద్ర ప్రసాద్ వెల్లడించారు. నివేదిక వచ్చిన తర్వాత కేసులో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు.

వివరాలు2లో..



# కేసులు ఎత్తేయండి.. లేదంటే ఆందోళనే!

- »మళ్లీ ఉద్యమమే.. కేంద్రానికి సీజేపీ అల్టిమేటం
- »ఒప్పందం అమలు చేయాలని డిమాండ్

నీట్ వివాదంపై దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టిన కాక్రోచ్ జనతా పార్టీ మరోసారి కేంద్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక జారీ చేసింది. నిరసనకారులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని స్పష్టం చేసింది. లేనిపక్షంలో రేపటి నుంచే తిరిగి దేశవ్యాప్తంగా ఆందోళనలు ప్రారంభిస్తామని ప్రకటించింది. కేంద్రంతో జరిగిన చర్చల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఉల్లంఘిస్తోందని సీజేపీ ఆరోపించింది.

### అరెస్టులు కొనసాగుతున్నాయంటూ ఆరోపణ

సీజేపీ ప్రతినిధి ఆశుతోష్ రాంకా సోషల్ మీడియా వేదికగా కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లకు విజ్ఞప్తి చేశారు. బిహార్, పశ్చిమ బెంగాల్‌లో వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేశారని పేర్కొన్నారు. ఢిల్లీలో సహా పలు రాష్ట్రాల్లో ఉద్యమానికి మద్దతు తెలిపిన వాలంటీర్లను వేధిస్తున్నారని ఆరోపించారు. చర్చల సమయంలో పోలీసు చర్యలు ఉండవని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు.

## పేపర్ లీక్.. కొత్త చట్టం

• సవరణ బిల్లుతో కాక• మూడు నెలల్లోనే తీర్పు!



దేశవ్యాప్తంగా పరీక్షల పారదర్శకతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. పబ్లిక్ ఎగ్జామినేషన్స్... ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్ సవరణ బిల్లు-2026ను సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. కేంద్ర సిబ్బంది శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. రెండు సంవత్సరాల క్రితం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ చట్టాన్ని మరింత కఠినంగా మార్చేందుకు ఈ సవరణలు తీసుకొచ్చినట్లు ప్రభుత్వం వెల్లడించింది.



## విద్యార్థులపై పోలీసుల దాడి

- అమిత్ షా క్షమాపణ డిమాండ్
- పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన

నీట్ ప్రశ్నాపత్రం లీక్ అంశంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు అమానుషంగా వ్యవహరించారని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన చేపట్టారు. పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా నేతృత్వంలో ఎంపీలు మకర్ ద్వార్ వద్ద ప్లకార్డులు, భారీ బ్యానర్‌తో ఆందోళన నిర్వహించారు.

# 'శక్తిశాట్'లో జెస్సీకి చోటు



- »ప్రపంచ వేదికపై ఏపీ ప్రతిభ
- »అంతరిక్షం మిషన్‌లో తెలుగు తేజం
- »అభినందించిన మంత్రి నారా లోకేశ్

ప్రపంచంలోనే తొలి ఆల్‌గర్ల్స్ గ్లోబల్ లూనార్ క్యూబ్‌శాట్ ప్రాజెక్టు 'మిషన్ శక్తిశాట్'కు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థిని కందుల జెస్సీ ఎంపికై అరుదైన ఘనత సాధించింది. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరానికి చెందిన జెస్సీ ప్రస్తుతం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. భారత్ నుంచి ఎంపికైన 20 మంది బాలికల్లో చోటు దక్కించుకున్న ఆమె, ఈ ఘనత సాధించిన ఏకైక ఆంధ్రప్రదేశ్ విద్యార్థినిగా నిలిచింది. మిషన్ శక్తిశాట్ డైరెక్టర్ శ్రీమతి కేశన్‌తో కలిసి ఉండవల్లిలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను జెస్సీ కలిశారు. (వివరాలు 2లో..)

## టార్గెట్ అమిత్ షా..!

### పార్లమెంట్‌లో రాహుల్ దూకుడు



2లో..

నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం, విద్యార్థులపై పోలీసుల బలప్రయోగం అంశాలను కేంద్రంగా చేసుకుని పార్లమెంట్‌లో కాంగ్రెస్, ఇండియా కూటమి దూకుడు పెంచుతున్నాయి. విద్యార్థుల ఆందోళనలు ముగిసినా రాజకీయ పోరాటం మాత్రం కొనసాగించాలని ప్రతిపక్షం నిర్ణయించింది. ముఖ్యంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాను నేరుగా లక్ష్యంగా చేసుకుని జవాబుదారీతనం కోరుతోంది. పార్లమెంట్ ప్రాంగణంలో ప్రియాంకా గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ ఎంపీలు నిరసన చేపట్టగా, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అమిత్ షాకు లేఖ రాసి విద్యార్థులపై జరిగిన బలప్రయోగంపై వివరణ కోరారు. శాంతియుత నిరసన తెలిపిన విద్యార్థులపై ప్రాణాంతక ఆయుధాల వినియోగానికి అనుమతి ఇచ్చారా అంటూ ప్రశ్నించారు. మరోవైపు పేపర్ లీక్ సవరణ బిల్లుపై చర్చలో పాల్గొని ప్రభుత్వాన్ని నిలదీయాలని ఇండియా కూటమి నిర్ణయించింది. విద్యార్థుల సమస్యలు, పోలీసుల చర్యలు, కేంద్ర విద్యా విధాన వైఫల్యాలను సభలో ప్రధానంగా ప్రస్తావించాలని వ్యూహం ఖరారు చేసింది. దీంతో పార్లమెంట్ వేదికగా అమిత్ షాపై ప్రతిపక్షం రాజకీయ ఒత్తిడి మరింత పెరగనున్న సంకేతాలు కనిపిస్తున్నాయి.



## లిక్కర్ స్కామ్ కేసులో బెయిల్

లిక్కర్ స్కామ్ కేసులో మాజీ ఐఏఎస్ అధికారులు కె. ధనుంజయరెడ్డి, పి. కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. కొన్ని షరతులతో బెయిల్ మంజూరు చేసిన న్యాయస్థానం ధనుంజయరెడ్డి, బాలాజీ గోవిందప్ప ప్రతి ఆదివారం దర్యాప్తు అధికారుల ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. (వివరాలు 7లో..)



## తమిళనాడు సీఎం విజయ్‌కు షాక్

### ప్రభుత్వ ఉత్తర్వులపై హైకోర్టు బ్రేక్

### తొక్కిసలాట బాధితుల ఉద్యోగాలు రద్దు


తమిళనాడులో కరూర్ తొక్కిసలాట ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలను మద్రాస్ హైకోర్టు రద్దు చేసింది. సీఎం సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వం జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులు చట్టబద్ధం కావని మదురై బెంచ్ స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలను విచారించిన ధర్మాసనం ప్రభుత్వ నిర్ణయాన్ని కొట్టివేసింది. (2లో..)

## డీప్‌ఫేక్ పోస్టులపై గడ్కరీ పోరు

### మెటా, గూగుల్, ఎక్స్‌కు లీగల్ షాక్



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి బాంబే హైకోర్టు కీలక ఊరట ఇచ్చింది. ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్ (ఈ20)తో తనను తప్పుడు రీతిలో అనుసంధానిస్తూ సోషల్ మీడియాలో ప్రచారమైన డీప్‌ఫేక్ పోస్టులపై మెటా, గూగుల్, ఎక్స్‌తో పాటు ఇతర గుర్తు తెలియని వ్యక్తులపై సివిల్ దావా వేయడానికి అనుమతి ఇచ్చింది. జస్టిస్ అభయ్ అహూజా ఈ మేరకు అనుమతి మంజూరు చేశారు. తప్పుడు పోస్టులను ఇంటర్నెట్ నుంచి తొలగించాలని కూడా గడ్కరీ కోర్టును కోరనున్నారు. (వివరాలు 2లో..)



## రివ్యూ పిటిషన్‌కు నో

- మత మార్పిడితో ఎస్సీ హోదా రద్దు..!
- మరోసారి స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

షెడ్యూల్డ్ కులం (ఎస్సీ)కు చెందిన వ్యక్తి హిందూ, సిక్కు, బౌద్ధ మతాలను విడిచి మరో మతంలోకి మారితే ఎస్సీ హోదా వెంటనే కోల్పోతాడని గతంలో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు మరోసారి సమర్థించింది. ఆ తీర్పును పునఃసమీక్షించాలని దాఖలైన రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కేసును విచారించిన జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్ ధర్మాసనం మార్చి 24, 2026న ఇచ్చిన తీర్పులో ఎలాంటి స్పష్టమైన తప్పు కనిపించలేదని పేర్కొంది. (వివరాలు 2లో..)

# నెక్స్ట్.. కాపు బాపు

### టీడీపీలో బొండా బాంబు

### కాకరేపుతున్న కాపు రాజకీయం

7లో..



కాపు రాజకీయాలు మరోసారి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల కేంద్రబిందువుగా మారుతున్నాయి. ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభలో టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నేత అంబటి రాంబాబు ఒకే వేదికపై కనిపించడం రాజకీయ ప్రకంపనలకు దారితీసింది. ఆ తర్వాత టీడీపీ అధిష్ఠానం బొండా ఉమ నుంచి వివరణ కోరడం ఈ వ్యవహారాన్ని మరింత హాట్‌టాపిక్‌గా మార్చింది. ఇది కేవలం పార్టీ క్రమశిక్షణ అంశమేనా? లేక కాపు సామాజికవర్గంలో మారుతున్న రాజకీయ సమీకరణాలకు సంకేతమా? అనే చర్చ మొదలైంది. ఒకవైపు ముద్రగడ తర్వాత కాపు నాయకత్వం ఎవరనే ప్రశ్న వినిపిస్తుండగా, మరోవైపు బొండా వ్యాఖ్యలు కాపు ఆత్మగౌరవ రాజకీయాలను మళ్లీ తెరపైకి తెచ్చాయి. పవన్ కళ్యాణ్ ఇప్పటికే కూటమిలో కీలక నాయకుడిగా ఉన్నా, కాపు సమాజంలో మరో బలమైన స్వరం అవసరమా అనే వాదన కూడా వినిపిస్తోంది. అధికార పార్టీ స్పందన, ప్రతిపక్ష వ్యూహాలు, కాపు ఓటు బ్యాంక్ చుట్టూ జరుగుతున్న పరిణామాలు రాబోయే రాజకీయాలకు కొత్త దిశ చూపే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం బొండా ఉమ చుట్టూ మొదలైన చర్చ వ్యక్తిగత రాజకీయాలను దాటి, కాపు నాయకత్వ భవిష్యత్తుపై పెద్ద రాజకీయ చర్చగా మారుతోంది.

## కమిటీ ముందు హాజరవుతా

- పార్టీకి నష్టం చేసే వ్యాఖ్యలు చేయలేదు
- స్పష్టం చేసిన ఎమ్మెల్యే బొండా ఉమ



## 'అప్పుడు ఒప్పు.. ఇప్పుడు తప్పా?'

### బొండా వివాదంపై అంబటి కౌంటర్



## సాయికృష్ణ కేసులో నాగరాజు కస్టడీకి గ్రీన్ సిగ్నల్

సాయికృష్ణ కస్టడీ మరణం, అదృశ్యం కేసులో నిందితుడైన సస్పెండ్‌డ్ మాజీ సీఐ ఎస్ఎస్‌వీవీ నాగరాజు పోలీసు కస్టడీ విచారణపై హైకోర్టు విధించిన పలు ఆంక్షలను సుప్రీంకోర్టు సడలించింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను విచారించిన జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం, రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలోనే విచారణ జరపాలన్న షరతు ఆచరణ సాధ్యం కాదని పేర్కొంది. కేసు దర్యాప్తు సమర్థంగా సాగాలంటే నిందితుడిని అవసరమైన ప్రాంతాలకు తీసుకెళ్లే స్వేచ్ఛ దర్యాప్తు బృందానికి ఉండాలని స్పష్టం చేసింది. (వివరాలు 7లో..)

# పేపర్ లీక్.. కొత్త చట్టం

- సవరణ బిల్లుతో కాక
- మూడు నెలల్లోనే తీర్పు!

దేశవ్యాప్తంగా పరీక్షల పారదర్శకతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. పబ్లిక్ ఎగ్జామినేషన్స్... ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్ సవరణ బిల్లు-2026ను సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. కేంద్ర సిబ్బంది శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. రెండు సంవత్సరాల క్రితం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ చట్టాన్ని మరింత కఠినంగా మార్చేందుకు ఈ సవరణలు తీసుకొచ్చినట్లు ప్రభుత్వం వెల్లడించింది.



శిక్షలు మరింత కఠినం


### ప్రత్యేక కోర్టులు, రెండు నెలల్లో దర్యాప్తు

కొత్త బిల్లులో అత్యంత కీలక ప్రతిపాదన ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు. ప్రతి రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతం సెషన్స్ కోర్టులను ప్రత్యేక కోర్టులుగా ప్రకటించే అధికారం ప్రభుత్వాలకు ఇవ్వనున్నారు. ఈ కోర్టుల్లో విచారణ రోజువారీగా జరగాలి. చార్జ్‌షీట్ దాఖలైన తేదీ నుంచి మూడు నెలల్లోపు విచారణ పూర్తి చేసి తీర్పు ఇవ్వాలనే నిబంధనను ప్రతిపాదించారు. దీంతో పేపర్ లీక్ కేసులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండకుండా చర్యలు తీసుకునే అవకాశం ఏర్పడుతుంది. పేపర్ లీక్ కేసుల దర్యాప్తు కూడా వేగంగా పూర్తయ్యేలా బిల్లులో నిబంధనలు చేర్చారు. ప్రతి కేసులో రెండు నెలల్లోపు దర్యాప్తు పూర్తి చేయాలని ప్రతిపాదించారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టే అవకాశం కూడా కల్పించారు. పెద్ద స్థాయి పరీక్షల్లో అక్రమాలు వెలుగులోకి వస్తే వెంటనే కేంద్ర స్థాయిలో విచారణ ప్రారంభించేలా చట్టానికి బలం చేకూర్చారు.

పేపర్ లీక్ నేరాలకు ప్రస్తుతం ఉన్న శిక్షలను మరింత పెంచే ప్రతిపాదనను బిల్లులో చేర్చారు. జైలు శిక్ష కాలాన్ని పెంచడంతో పాటు భారీ జరిమానాలు విధించేలా మార్పులు చేశారు. ప్రతి రాష్ట్రం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించే అధికారం కూడా ఇవ్వనున్నారు. నేరస్థులపై కేసులు సమర్థంగా వాదించి త్వరగా శిక్ష పడేలా ఈ మార్పులు ఉపయోగపడతాయని కేంద్రం భావిస్తోంది. ప్రత్యేక కోర్టుల తీర్పులపై హైకోర్టులో అప్పీల్ చేసే అవకాశం బిల్లులో కల్పించారు. డివిజన్ బెంచ్ ముందు అప్పీల్ విచారణ జరగాలి. అప్పీల్ దాఖలైన మూడు నెలల్లోపు దానిపై కూడా నిర్ణయం తీసుకోవాలని ప్రతిపాదించారు. దీంతో న్యాయ ప్రక్రియ వేగవంతం అవుతుందని ప్రభుత్వం చెబుతోంది.

# రివ్యూ పిటిషన్‌కు నో

- మత మార్పిడితో ఎస్సీ హోదా రద్దు..!
- మరోసారి స్పష్టం చేసిన సుప్రీంకోర్టు



షెడ్యూల్డ్ కులం (ఎస్సీ)కు చెందిన వ్యక్తి హిందూ, సిక్కు, బౌద్ధ మతాలను విడిచి మరో మతంలోకి మారితే ఎస్సీ హోదా వెంటనే కోల్పోతాడని గతంలో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు మరోసారి సమర్థించింది. ఆ తీర్పును పునఃసమీక్షించాలని దాఖలైన రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కేసును విచారించిన జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్ ధర్మాసనం మార్చి 24, 2026న ఇచ్చిన తీర్పులో ఎలాంటి స్పష్టమైన తప్పు కనిపించలేదని పేర్కొంది. అందువల్ల రివ్యూ పిటిషన్‌ను తిరస్కరిస్తున్నట్లు స్పష్టం చేసింది. మౌఖిక వాదనలు వినాలన్న అభ్యర్థనను కూడా కోర్టు అంగీకరించలేదు.

**మార్పిడి జరిగిన క్షణమే..**

మార్చి 24న ఇచ్చిన కీలక తీర్పులో రాజ్యాంగంలోని షెడ్యూల్డ్ కులాల ఆర్డర్-1950లోని క్లాజ్-3ను సుప్రీంకోర్టు విశ్లేషించింది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలను అనుసరించే వారికే ఎస్సీ హోదా వర్తిస్తుందని పేర్కొంది. క్రైస్తవ మతం సహా క్లాజ్-3లో లేని ఏ మతంలోకి మారినా పుట్టుకతో వచ్చిన ఎస్సీ హోదా వెంటనే పూర్తిగా రద్దవుతుందని స్పష్టం చేసింది. ఎస్సీ హోదాతో లభించే రిజర్వేషన్లు, చట్టపరమైన రక్షణలు, ప్రభుత్వ ప్రయోజనాలు, ప్రత్యేక హక్కులు అన్నీ అదే క్షణం నుంచి ముగుస్తాయని కోర్టు తేల్చింది.

**ఏపీ హైకోర్టు తీర్పుకు మద్దతు**

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును కూడా సుప్రీంకోర్టు సమర్థించింది. షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారిన వెంటనే ఎస్సీ హోదా పూర్తిగా కోల్పోతాడని హైకోర్టు చెప్పిన అభిప్రాయమే సరైందని పేర్కొంది. రాజ్యాంగంలోని షెడ్యూల్డ్ కులాల ఆర్డర్-1950 చట్టబద్ధంగా అమల్లో ఉందని గుర్తుచేసింది. ఇప్పటివరకు జరిగిన సవరణల్లో సిక్కు మతాన్ని 1956లో, బౌద్ధ మతాన్ని 1990లో చేర్చారని తెలిపింది. అయితే క్రైస్తవ మతాన్ని ఇప్పటివరకు చేర్చలేదని స్పష్టం చేసింది.

**తిరిగి పాత మతంలోకి వస్తే షరతులు**

తిరిగి హిందూ, సిక్కు, బౌద్ధ మతాల్లోకి మారినట్లు ఎవరైనా చెబితే ఆటోమేటిక్‌గా ఎస్సీ హోదా తిరిగి రాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మొదట షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తేనని నిరూపించాలి. తిరిగి అసలు మతంలోకి నిజాయితీగా మారినట్లు విశ్వసనీయ ఆధారాలు సమర్పించాలి. అసలు కులానికి చెందిన సభ్యులు, సంబంధిత సమాజం తిరిగి ఆ వ్యక్తిని అంగీకరించినట్లు స్పష్టమైన సాక్ష్యాలు ఉండాలని కోర్టు పేర్కొంది. ఈ మూడు షరతులు నెరవేరిన తర్వాతే హోదా పునరుద్ధరణ అంశాన్ని పరిశీలించే అవకాశం ఉంటుందని వెల్లడించింది. ఈ తాజా ఉత్తర్వుతో మార్చి 24న ఇచ్చిన కీలక తీర్పు యథాతథంగా కొనసాగనుంది.

# తమిళనాడు సీఎం విజయ్‌కు షాక్

- ప్రభుత్వ ఉత్తర్వులకు హైకోర్టు బ్రేక్
- తొక్కిసలాట బాధితుల ఉద్యోగాలు రద్దు



తమిళనాడులో కరూర్ తొక్కిసలాట ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలను మద్రాస్ హైకోర్టు రద్దు చేసింది. సీఎం సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వం జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులు చట్టబద్ధం కావని మదురై బెంచ్ స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలను విచారించిన ధర్మాసనం ప్రభుత్వ నిర్ణయాన్ని కొట్టివేసింది.

**ఘటనకు రాజకీయ నేపథ్యం**

2025 సెప్టెంబర్‌లో తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు సి. జోసెఫ్ విజయ్ నిర్వహించిన రోడ్‌షో సందర్భంగా కరూర్‌లో తీవ్ర తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు.

**తాత్కాలిక నియామకాలకే అనుమతి**

ఈ కేసు విచారణ కొనసాగుతున్న సమయంలో బాధిత కుటుంబాలకు నియామక పత్రాలు పంపిణీ చేయడానికి హైకోర్టు ముందుగా అనుమతి ఇచ్చింది. అయితే అవి శాశ్వత నియామకాలు కాదని, తుది తీర్పుకు లోబడి మాత్రమే అమల్లో ఉంటాయని అప్పుడే స్పష్టం చేసింది. న్యాయపరమైన పరిశీలన పూర్తయ్యే వరకు ఆ ఉద్యోగాలు తాత్కాలికంగానే పరిగణించాలని తెలిపింది.

**ప్రభుత్వానికి ఎదురుదెబ్బ**

జస్టిస్ సి.వి. కార్తికేయన్, జస్టిస్ ఆర్. శక్తివేల్‌లతో కూడిన ధర్మాసనం తుది విచారణ అనంతరం ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేసింది. దీంతో బాధిత కుటుంబాలకు ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అమాన్యమైంది. ఈ తీర్పు ప్రభుత్వ ప్రత్యేక రాయితీలు, నియామకాల విషయంలో చట్టబద్ధతకు ప్రాధాన్యం ఎంత ముఖ్యమో మరోసారి స్పష్టం చేసింది.

# కేసులు ఎత్తేయండి.. లేదంటే ఆందోళనే

- మళ్లీ ఉద్యమమే.. కేంద్రానికి సీజేపీ అల్టిమేటం
- ఒప్పందం అమలు చేయాలని డిమాండ్



నీట్ వివాదంపై దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టిన కాక్రోచ్ జనతా పార్టీ మరోసారి కేంద్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక జారీ చేసింది. నిరసనకారులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని స్పష్టం చేసింది. లేనిపక్షంలో రేపటి నుంచే తిరిగి దేశవ్యాప్తంగా ఆందోళనలు ప్రారంభిస్తామని ప్రకటించింది. కేంద్రంతో జరిగిన చర్చల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఉల్లంఘిస్తోందని సీజేపీ ఆరోపించింది.

**కొనసాగుతున్న అరెస్టులు**

సీజేపీ ప్రతినిధి ఆశుతోష్ రాంకా సోషల్ మీడియా వేదికగా కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లకు విజ్ఞప్తి చేశారు. బిహార్, పశ్చిమ బెంగాల్‌లో వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేశారని పేర్కొన్నారు. ఢిల్లీలో సహా పలు రాష్ట్రాల్లో ఉద్యమానికి మద్దతు తెలిపిన వాలంటీర్లను వేధిస్తున్నారని ఆరోపించారు. చర్చల సమయంలో పోలీసు చర్యలు ఉండవని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు.

**లిఖితపూర్వక హామీ ఇవ్వాలని డిమాండ్**

నిరసనకారులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను వెంటనే రద్దు చేయాలని సీజేపీ డిమాండ్ చేసింది. అరెస్టయిన విద్యార్థులను విడుదల చేయాలని కోరింది. భవిష్యత్తులో కొత్త కేసులు నమోదు చేయబోమన్న హామీని లిఖితపూర్వకంగా ఇవ్వాలని కేంద్రాన్ని కోరింది. ఆ పత్రాన్ని రేపటిలోగా అందజేయాలని స్పష్టం చేసింది. లేనిపక్షంలో మళ్లీ జంతర్ మంతర్ వేదికగా ఆందోళనలు ప్రారంభిస్తామని హెచ్చరించింది.

**37 రోజుల తర్వాత కొత్త మలుపు**

అభిజీత్ దిప్కే నేతృత్వంలోని సీజేపీ 37 రోజుల పాటు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలు చేపట్టింది. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన తర్వాత సత్సంకల్పంతో ఉద్యమాన్ని తాత్కాలికంగా విరమించినట్లు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం ఐదు ప్రధాన డిమాండ్లపై చర్చలకు అంగీకరించిందని తెలిపింది. నీట్ అభ్యర్థుల ఆత్మహత్యల బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వడం, నిరసనకారులపై కేసులు ఉపసంహరించడం వంటి అంశాలపై హామీలు లభించాయని వెల్లడించింది.

**సుప్రీం వ్యాఖ్యలతో ఉద్యమానికి ఊతం**

జూలై 20న జరిగిన "ఛలో పార్లమెంట్" కార్యక్రమం హింసాత్మకంగా మారిన తర్వాత పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగం చేశారు. లాఠీచార్జ్ నిర్వహించి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తాజాగా సుప్రీంకోర్టు శాంతియుత నిరసన హక్కు రాజ్యాంగబద్ధమని స్పష్టం చేసింది. ఆందోళన జరుగుతోందనే కారణంతో పోలీసు అతిగా బలప్రయోగం చేయడం సమర్థనీయం కాదని వ్యాఖ్యానించింది. ఇదే సమయంలో పరీక్షా పేపర్ లీకేజీలకు కఠిన శిక్షలు విధించే బిల్లును కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టడం రాజకీయంగా కొత్త చర్చకు దారితీసింది.

# భోగాపురం సిద్ధం

- మోదీ రాకకు గ్రాండ్ ప్లాన్
- ఉత్తరాంధ్రకు కలల రెక్కలు
- ప్రారంభోత్సవంపై సీఎం సమీక్ష



భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా విమానాశ్రయం ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. భద్రత, ట్రాఫిక్, అతిథుల స్వాగతం, సభా ఏర్పాట్లు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**ఉత్తరాంధ్రకు గ్రోత్ ఇంజిన్**

భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని చంద్రబాబు తెలిపారు. 2,703 ఎకరాల విస్తీర్ణంలో రూ.4,727 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఆధునిక సౌకర్యాలతో సిద్ధమైందన్నారు. 3,800 మీటర్ల రన్‌వేతో తొలి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించే సామర్థ్యం కలిగి ఉందని చెప్పారు. 500 ఎకరాల్లో ఏవియేషన్ హబ్, 136 ఎకరాల్లో ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటుతో ఉపాధి, పారిశ్రామిక, పర్యాటక రంగాలకు పెద్ద ఊతం లభిస్తుందని వివరించారు.

**ధింసా నృత్యంతో ప్రధానికి స్వాగతం**

ప్రధాని మోదీకి ఉత్తరాంధ్ర సంస్కృతిని ప్రతిబింబించేలా ఘన స్వాగతం పలకాలని సీఎం సూచించారు. గిరిజనుల సంప్రదాయ ధింసా నృత్యం, కూచిపూడి ప్రదర్శనలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అత్యధిక మంది పాల్గొనే ధింసా నృత్యంతో గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించేలా ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. అరకు కాఫీ, ఉత్తరాంధ్ర పర్యాటక విశేషాలను దేశవ్యాప్తంగా ప్రచారం చేయాలని సూచించారు.

**రూ.18 వేల కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం**

ప్రధాని మోదీ ఉదయం 10:45 గంటలకు ప్రత్యేక విమానంలో భోగాపురం చేరుకోనున్నారు. విమానాశ్రయ టెర్మినల్‌ను ప్రారంభించిన తర్వాత రూ.18 వేల కోట్ల విలువైన పెట్రోలియం, రహదారులు, ఇతర శాఖలకు చెందిన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమం ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలవనుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

# శివానీ మృతి మిస్టరీ

- ఫోరెన్సిక్‌కు సూసైడ్ నోట్
- అన్ని కోణాల్లో దర్యాప్తు



పోలవరం జిల్లాలో పదో తరగతి విద్యార్థిని ముర్రం శివానీ ఆత్మహత్య కేసు దర్యాప్తు వేగం పుంజుకుంది. ఇర్లపల్లి గ్రామానికి చెందిన శివానీ మృతి కేసును పోలీసులు అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నారు. ఘటనా స్థలికి చేరుకున్న ఏపీ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఏపీఎఫ్ఎస్ఎల్), క్లూస్ టీమ్‌లు కీలక ఆధారాలను సేకరించాయి. సంఘటనా స్థలంలో లభించిన సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు సీఐ నరేంద్ర ప్రసాద్ వెల్లడించారు. నివేదిక వచ్చిన తర్వాత కేసులో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు.

**మూడు రోజుల క్రితమే సీఎంతో వేదికపై**

శివానీ జూలై 24న రంపచోడవరంలో జరిగిన మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ 4.0 కార్యక్రమంలో పాల్గొంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ సమక్షంలో వేదికపై ప్రసంగించి అందరి ప్రశంసలు అందుకుంది. చదువులో ప్రతిభ కనబరిచిన ఆమె షైనింగ్ స్టార్ అవార్డు అందుకోవాలని ఆశపడింది. అలాంటి విద్యార్థిని ఆకస్మికంగా ప్రాణాలు తీసుకోవడం కుటుంబ సభ్యులను, గ్రామస్థులను తీవ్ర విషాదంలోకి నెట్టింది.

**సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి**

శివానీ మృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వేదికపై ఎంతో ఉత్సాహంగా మాట్లాడిన ఆ బాలికతో జరిగిన సంభాషణ ఇప్పటికీ గుర్తుందని తెలిపారు. భవిష్యత్తుపై ఎన్నో ఆశయాలు పెట్టుకున్న గిరిజన విద్యార్థిని ఇలా ప్రాణాలు తీసుకోవడం బాధాకరమన్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.

**విద్యార్థులకు సీఎం పిలుపు**

ఎలాంటి సమస్యలు ఎదురైనా ఆత్మస్థైర్యం కోల్పోవద్దని ముఖ్యమంత్రి విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, మనసులోని బాధను కుటుంబ సభ్యులు, స్నేహితులతో పంచుకోవాలని సూచించారు. ఒత్తిడి, నిరాశకు లొంగకుండా లక్ష్యాల దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మరోవైపు ఫోరెన్సిక్ నివేదిక ఆధారంగా కేసులో తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## తల్లికి వందనంపై రాచమల్లు ఫైర్

- నాలుగు మోసాల ఆరోపణ
- పథకంపై ఘాటు విమర్శలు

ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకంపై తీవ్ర విమర్శలు చేశారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, ఈ పథకం పేరుతో తల్లులను నాలుగు రకాలుగా మోసం చేస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు పలు ప్రశ్నలు సంధిస్తూ ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 'తల్లికి వందనం' అమలు చేస్తామని ప్రకటించినా, తొలి ఏడాదిలో తల్లుల ఖాతాల్లో నగదు జమ చేయలేదని రాచమల్లు విమర్శించారు. రాష్ట్రంలో సుమారు 80 లక్షల మంది విద్యార్థులు ఉండగా, కేవలం 60 లక్షల మందికే లబ్ధి అందిందని, మరో 20 లక్షల మంది అర్హులు పథకానికి దూరమయ్యారని ఆరోపించారు.

### సాయం తగ్గించారన్న విమర్శ

ఎన్నికల సమయంలో ఒక్కో విద్యార్థికి రూ.15 వేల చొప్పున ఇస్తామని ప్రకటించి, ప్రస్తుతం రూ.13 వేలకే పరిమితం చేశారని రాచమల్లు అన్నారు. అదీ అందరికీ ఒకే విధంగా కాకుండా రూ.5 వేలు, రూ.7 వేలు, రూ.10 వేలు, రూ.13 వేలుగా వేర్వేరు మొత్తాలు జమ చేశారని విమర్శించారు. ఇది హామీలకు విరుద్ధమని పేర్కొన్నారు. గత ఏడాది లబ్ధి పొందని తల్లులు ఈ ఏడాది కూడా నిరాశ చెందారని రాచమల్లు తెలిపారు. 'తల్లికి వందనం' నిధులను కూడా సకాలంలో విడుదల చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలైన 'అమ్మఒడి' పథకం కింద నిర్ణీత సమయంలోనే నిధులు విడుదలయ్యేవని గుర్తు చేస్తూ, ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమ హామీల అమలులో విఫలమైందని విమర్శించారు.

# 'శక్తిశాట్'లో జెస్సీకి చోటు

- ప్రపంచ వేదికపై ఏపీ ప్రతిభ
- అంతరిక్షం మిషన్‌లో తెలుగు తేజం
- అభినందించిన మంత్రి నారా లోకేశ్



ప్రపంచంలోనే తొలి ఆల్‌గర్ల్స్ గ్లోబల్ లూనార్ క్యూబ్‌శాట్ ప్రాజెక్టు 'మిషన్ శక్తిశాట్'కు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థిని కందుల జెస్సీ ఎంపికై అరుదైన ఘనత సాధించింది. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరానికి చెందిన జెస్సీ ప్రస్తుతం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. భారత్ నుంచి ఎంపికైన 20 మంది బాలికల్లో చోటు దక్కించుకున్న ఆమె, ఈ ఘనత సాధించిన ఏకైక ఆంధ్రప్రదేశ్ విద్యార్థినిగా నిలిచింది. మిషన్ శక్తిశాట్ డైరెక్టర్ శ్రీమతి కేశన్‌తో కలిసి ఉండవల్లిలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను జెస్సీ కలిశారు.

**12 వేల మందిలో మెరిసిన ప్రతిభ**

108 దేశాల నుంచి సుమారు 12 వేల మంది బాలికలు ఈ కార్యక్రమానికి దరఖాస్తు చేసుకున్నారు. పలు దశల ఎంపిక ప్రక్రియ తర్వాత జెస్సీ తుది జాబితాలో స్థానం సంపాదించింది. ఏడో తరగతి నుంచే అంతరిక్ష విజ్ఞానంపై ఆసక్తి పెరిగిందని ఆమె తెలిపింది. పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో చేసిన ప్రయోగాలే తనలో శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తిని పెంచాయని చెప్పింది. మిషన్ శక్తిశాట్‌లో భాగంగా 550 సెషన్లు, 21 మాడ్యూల్స్ పూర్తి చేసినట్లు వెల్లడించింది. భవిష్యత్‌లో ఏరోనాటికల్ ఇంజనీర్‌గా ఎదగడమే తన లక్ష్యమని తెలిపింది.

**లోకేశ్ అభినందనలు**

జెస్సీ సాధించిన విజయాన్ని మంత్రి నారా లోకేశ్ అభినందించారు. అంతరిక్ష రంగంలో యువతకు అపార అవకాశాలు ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్న 22 క్లస్టర్లలో స్పేస్ సిటీ క్లస్టర్ కూడా ఒకటని వివరించారు. జెస్సీ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిందని ప్రశంసించారు. ఆమె భవిష్యత్ విద్య, పరిశోధనలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

**ప్రభుత్వ పాఠశాలకు గర్వకారణం**

ఒక ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అంతర్జాతీయ అంతరిక్ష ప్రాజెక్టుకు ఎంపిక కావడం రాష్ట్రానికి విశేష గుర్తింపుగా మారింది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మిషన్ శక్తిశాట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. జెస్సీ విజయం మరెందరో విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని, శాస్త్ర సాంకేతిక రంగంలో మరిన్ని విజయాలు సాధించేలా ప్రోత్సాహం అందించాలని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# పేపర్ లీక్‌పై దూకుడు

- అమిత్ షాపై ప్రతిపక్షం గురి
- పార్లమెంట్‌లో పోరుకు వ్యూహం

విద్యార్థుల ఆందోళనలు ముగిసినా కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై రాజకీయ ఒత్తిడిని కొనసాగించాలని ఇండియా కూటమి నిర్ణయించింది. పేపర్ లీక్ ఘటనల సందర్భంగా విద్యార్థులపై పోలీసులు అధిక బలప్రయోగం చేశారని ఆరోపిస్తూ పార్లమెంట్‌లో ప్రభుత్వాన్ని నిలదీయాలని వ్యూహం ఖరారు చేసింది. ప్రజా పరీక్షల (అక్రమ మార్గాల నిరోధక) సవరణ బిల్లుపై చర్చను బహిష్కరించాలా, పాల్గొనాలా అనే అంశంపై సమావేశంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనా, చివరకు చర్చలో పాల్గొని తమ వాదనను బలంగా వినిపించాలని నిర్ణయించారు. విద్యార్థుల సమస్యలు, పోలీసుల చర్యలు, విద్యా విధానంలోని లోపాలను సభలో ప్రస్తావించాలని నేతలు నిర్ణయించారు. సమాజ్‌వాదీ పార్టీ రామాలయ విరాళాల కేసుపై కూడా చర్చ జరగాలని సూచించినా, ఎక్కువ మంది ప్రతిపక్ష నేతలు ప్రధాన దృష్టి విద్యా రంగంపైనే ఉండాలని అభిప్రాయపడ్డారు. పేపర్ లీక్ బిల్లు పేరుతో కేంద్రం కేవలం జరిమానాలు, జైలు శిక్షలు పెంచిందని, అసలు సమస్యల పరిష్కారానికి అవసరమైన మార్పులు చేయలేదని రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ ఎంపీ ఎన్.కే. ప్రేమచంద్రన్ విమర్శించారు. ఇప్పటికే చట్టం అమల్లో ఉండగా కొత్త సవరణల వల్ల ప్రయోజనం ఏమిటని డీఎంకే ప్రశ్నించింది. నీట్‌ను పూర్తిగా రద్దు చేయాలన్న తమ డిమాండ్‌ను మరోసారి స్పష్టం చేసింది. పార్లమెంట్‌లో సమన్వయంతో పాటు బయట కూడా ఉమ్మడి ఆందోళనలు కొనసాగించాలని ఇండియా కూటమి నిర్ణయించింది.

### టార్గెట్ అమిత్ షా

- పార్లమెంట్‌లో రాహుల్ దూకుడు



నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం, విద్యార్థులపై పోలీసుల బలప్రయోగం అంశాలను కేంద్రంగా చేసుకుని పార్లమెంట్‌లో కాంగ్రెస్, ఇండియా కూటమి దూకుడు పెంచుతున్నాయి. విద్యార్థుల ఆందోళనలు ముగిసినా రాజకీయ పోరాటం మాత్రం కొనసాగించాలని ప్రతిపక్షం నిర్ణయించింది. ముఖ్యంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాను నేరుగా లక్ష్యంగా చేసుకుని జవాబుదారీతనం కోరుతోంది. పార్లమెంట్ ప్రాంగణంలో ప్రియాంకా గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ ఎంపీలు నిరసన చేపట్టగా, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అమిత్ షాకు లేఖ రాసి విద్యార్థులపై జరిగిన బలప్రయోగంపై వివరణ కోరారు. శాంతియుత నిరసన తెలిపిన విద్యార్థులపై ప్రాణాంతక ఆయుధాల వినియోగానికి అనుమతి ఇచ్చారా అంటూ ప్రశ్నించారు. మరోవైపు పేపర్ లీక్ సవరణ బిల్లుపై చర్చలో పాల్గొని ప్రభుత్వాన్ని నిలదీయాలని ఇండియా కూటమి నిర్ణయించింది. విద్యార్థుల సమస్యలు, పోలీసుల చర్యలు, కేంద్ర విద్యా విధాన వైఫల్యాలను సభలో ప్రధానంగా ప్రస్తావించాలని వ్యూహం ఖరారు చేసింది. దీంతో పార్లమెంట్ వేదికగా అమిత్ షాపై ప్రతిపక్షం రాజకీయ ఒత్తిడి మరింత పెరగనున్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

# బీహార్ బంద్‌లో కాల్పులు

- ఏకే-47 వీడియో వైరల్

**పాట్నా, జులై 27:** బీహార్ బంద్ సందర్భంగా శివాన్ జిల్లాలో జరిగిన కాల్పుల ఘటన తీవ్ర కలకలం రేపింది. నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై ఓ పోలీసు సిబ్బంది ఏకే47 రైఫిల్‌తో కాల్పులు జరిపినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఉన్నతాధికారులు సంబంధిత కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా, వారిలో 15 ఏళ్ల మహమ్మద్ ఆరిఫ్ కూడా ఉన్నాడు. అతడి మెడలోని బుల్లెట్‌ను వైద్యులు శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. ఘటనపై ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా స్పందిస్తూ, విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని బీజేపీ ప్రభుత్వాన్ని విమర్శించారు.



# 2036 కలా? రేపటి నిజమా?

## డబ్బు లేని ప్రపంచం... నిజంగానే వస్తుందా?

**ఒక ఉదయం... మీరు కళ్ళు తెరిచే సరికి ప్రపంచం పూర్తిగా మారిపోయి ఉంటే ఎలా ఉంటుంది? జేబులో డబ్బు లేదు, బ్యాంక్ బ్యాలెన్స్ సున్నా... కానీ జీవితం మాత్రం ఆగలేదు! ఇంటి ముందు వేడి భోజనం సిద్ధంగా ఉంది, రోడ్లపై రోబోలు పని చేస్తున్నాయి. AI మీ ప్రతి అవసరాన్ని ముందే ఊహించి పూర్తి చేస్తోంది. డబ్బు అనే పదమే పాత కథలా మారిపోయిన ప్రపంచం... ఇది కలా? లేక రాబోయే నిజమా? ఇప్పటివరకు మనం నమ్మిన ఆర్థిక వ్యవస్థ ఒక్కసారిగా కూలిపోతే? మనిషి కంటే యంత్రం తెలివిగా మారితే? ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ చెబుతున్న ఈ భవిష్యత్ దృశ్యం ఇప్పుడు ప్రపంచాన్ని షాక్‌కు గురిచేస్తోంది. 2036 నాటికి డబ్బు విలువే లేకుండా పోతుందా? మన జీవితం పూర్తిగా AI చేతుల్లోకి వెళ్లిపోతుందా? ఈ ప్రశ్నలే ఇప్పుడు భవిష్యత్ తలుపులు తడుతున్నాయి... నిజంగా ఇది రాబోయే ప్రపంచమా? లేక మన ఊహకే పరిమితమా?**

ఒకసారి ఊహించండి. ఉదయం నిద్రలేచారు. జేబులో ఒక్క రూపాయి లేదు. బ్యాంక్ ఖాతాలో సున్నా. అయినా మీ ఇంటి ముందు అల్పాహారం సిద్ధంగా ఉంది. పిల్లల చదువు ఉచితం. ఆసుపత్రిలో చికిత్సకు బిల్లు లేదు. ఆఫీసుకు వెళ్లాల్సిన అవసరం లేదు. డ్రైవర్ లేని కారు మీ కోసం వచ్చి ఆగింది. ఇంట్లో పనిచేసే రోబో అన్ని పనులు పూర్తి చేసింది. మీకు కావాల్సిన ప్రతిదీ డబ్బు లేకుండానే అందుతోంది. ఇది సినిమా కథలా అనిపించొచ్చు. కానీ ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మాత్రం ఇదే భవిష్యత్తు కావొచ్చని చెబుతున్నారు.

**2036... డబ్బు విలువ మాయమవుతుందా?**

మస్క్ అంచనా ప్రకారం మరో పదేళ్లలో ఆర్టిఫీషియల్, రోబోలు ఉత్పత్తి చేసే వస్తువులు, సేవలు అంతగా పెరిగిపోతాయి. మనిషి జీవితానికి అవసరమైన దాదాపు ప్రతిదీ అపారంగా లభిస్తుంది. అవసరానికి మించి సమృద్ధి ఉంటే కొనుగోలు చేయడానికి డబ్బు ఎందుకు అవసరమనే ప్రశ్నను ఆయన ముందుకు తెచ్చారు. ఈ ఆలోచన నిజమైతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థనే తిరగరాసే మార్పు మొదలవుతుంది. ఈ ప్రశ్నకు ఇప్పుడే సమాధానం చెప్పడం కష్టం. ఒకవేళ ఆహారం, ఇల్లు, విద్య, వైద్యం, రవాణా నిజంగానే అందరికీ అందుబాటులోకి వస్తే పేదరికం అనే మాట చరిత్రలో కలిసిపోవచ్చు. నెలాఖరుకు జీతం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండకపోవచ్చు. అప్పుల భారం తగ్గొచ్చు. జీవితం కోసం కాదు... మనసుకు నచ్చిన పని కోసం మనుషులు పనిచేసే రోజులు రావొచ్చు. ఇది వినడానికి కలలా అనిపించినా టెక్నాలజీ వేగం చూస్తే అసాధ్యం అని కూడా చెప్పలేం.

**సినిమా కథలా... లేక రేపటి వార్తలా?**

ఈ అందమైన చిత్రానికి మరోవైపు చీకటి కూడా ఉంది. అన్ని పనులు రోబోలే చేస్తే మనిషి పాత్ర ఏమిటి? ఉద్యోగాలు ఏమవుతాయి? నిర్ణయాలు ఎవరు తీసుకుంటారు? మస్క్ అభిప్రాయం ప్రకారం AI మేధస్సు మనుషులను మించిపోయే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి. ఆ స్థాయికి చేరితే నియంత్రణ మన చేతుల్లో ఉంటుందా అన్న అనుమానం కూడా ఆయన వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక విప్లవం ఎంతటి అవకాశాలు తెస్తుందో అంతే పెద్ద ప్రమాదాలను కూడా తీసుకురావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకప్పుడు మొబైల్ ఫోన్, ఇంటర్నెట్, డ్రైవర్ లేని కారు కూడా సినిమా సన్నివేశాల్లా కనిపించేవి. నేడు అవి మన జీవితంలో భాగమయ్యాయి. ఇప్పుడు AI గురించి వినిపిస్తున్న అంచనాలు కూడా అలాంటి మార్పుకే సంకేతాలా అనే చర్చ మొదలైంది. 2036 నాటికి డబ్బు నిజంగానే అవసరం లేకుండా పోతుందా? లేక ఇది మరో సాంకేతిక కలగానే మిగిలిపోతుందా? సమాధానం కాలమే చెబుతుంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం... ప్రపంచం ఇప్పటివరకు చూడని అతి పెద్ద మార్పు వైపు వేగంగా అడుగులు వేస్తోంది.

**రేపటి ప్రపంచం... రేపటి ప్రశ్న!**

ఒకప్పుడు డబ్బు లేకపోతే జీవితం ఆగిపోతుందని ప్రపంచం నమ్మింది. ఇప్పుడు డబ్బు అవసరమే లేకుండా పోతుందని ప్రపంచంలోని అత్యంత ధనవంతుడు చెబుతున్నాడు. ఇదే కాలం రాసుకుంటున్న కొత్త ఆలోచన. 2036 నాటికి నిజంగానే నోట్లు చరిత్ర పుస్తకాలకే పరిమితమవుతాయా? రోబోలు ఉద్యోగాలే కాదు... ఆర్థిక వ్యవస్థను కూడా స్వాధీనం చేసుకుంటాయా? మనిషి సంపాదించడం మానేసి... కేవలం జీవించడం మాత్రమే మిగిలిపోతుందా? ఇవన్నీ ఇప్పటికి ప్రశ్నలే. కానీ ఒక విషయం మాత్రం ఖాయం. AI విప్లవం తలుపు తట్టడం కాదు... ఇప్పటికే ఇంట్లోకి అడుగుపెట్టింది. ఇక మిగిలింది ఒక్కటే... 2036లో మనిషి చేతిలో డబ్బు ఉంటుందా? లేక డబ్బు కంటే విలువైనదిగా AI మారుతుందా? సమాధానం కాలమే కాదు... మనిషి తీసుకునే నిర్ణయాలే రాయబోతున్నాయి.

# హైడ్రా కమిషనర్‌ను తొలగించండి

- పదేపదే కోర్టు ఉల్లంఘనలకు పాల్పడడంపై ఆగ్రహం
- ఇలాంటి వ్యక్తి అదే పోస్టులో కొనసాగడం సరికాదు
- లోతుకుంట భూముల వ్యవహారంపై హైకోర్టు విచారణ
- కోర్టులంటే గౌరవం ఉందంటూ క్షమాపణలు కోరిన రంగనాథ్



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. పదేపదే కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తున్న అధికారిని అదే పదవిలో కొనసాగించడం సమంజసం కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలను అమలు చేయాల్సిన ఉన్నతాధికారి వాటినే ధిక్కరించడం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని వ్యాఖ్యానించింది.

### 63 ధిక్కరణ పిటిషన్లపై ప్రశ్నలు

రంగనాథ్‌పై ఇప్పటికే 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు పెండింగ్‌లో ఉండటం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని హైకోర్టు పేర్కొంది. ఇన్ని ధిక్కరణ కేసులు ఎందుకు నమోదయ్యాయో ప్రభుత్వం తరఫు న్యాయవాదిని నేరుగా ప్రశ్నించింది. కోర్టులను ఆశ్రయించడం ప్రతి పౌరుడి హక్కు అని గుర్తు చేసిన ధర్మాసనం, ఆ హక్కును ప్రభుత్వ యంత్రాంగం గౌరవించాల్సిన బాధ్యత మరింత ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేసింది.

### లోతుకుంట భూములే కేంద్ర బిందువు

మల్కాజిగిరి పరిధిలోని లోతుకుంట సర్వే నంబర్లు 1, 2లో ఉన్న భూముల వివాదం ఈ కేసుకు కారణమైంది. శాంతా శ్రీరాం కన్స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై విచారణ జరిగింది. హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ హైడ్రా సిబ్బంది ఫెన్సింగ్ తొలగించారని పిటిషనర్ ఆరోపించారు. ఒకే అంశంలో పలుమార్లు కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘించడం తీవ్రమైన నేరమని ధర్మాసనం అభిప్రాయపడింది.

### ప్రభుత్వం తరపున వివరణ

విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ జోక్యం చేసుకున్నారు. పూర్తి వివరాలతో అఫిడవిట్ సమర్పిస్తామని కోర్టుకు తెలిపారు. అదే అఫిడవిట్‌లో రంగనాథ్ కోర్టుకు క్షమాపణలు తెలిపారు. న్యాయవ్యవస్థపై తనకు పూర్తి గౌరవం ఉందని పేర్కొన్నారు. లోతుకుంటలోని 40 ఎకరాల భూమిలోకి హైడ్రా బృందం ప్రవేశించలేదని వివరణ ఇచ్చారు. పిటిషనర్ చేస్తున్న ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధమని కూడా తెలిపారు.

### రూల్ ఆఫ్ లాపై హైకోర్టు హెచ్చరిక

రంగనాథ్ హైడ్రా కమిషనర్‌గా కొనసాగితే రూల్ ఆఫ్ లా దెబ్బతింటుందని హైకోర్టు తీవ్రంగా వ్యాఖ్యానించింది. సెక్రటరీ హోదాలో ఉన్న అధికారి కోర్టు ఆదేశాలను పదేపదే పట్టించుకోకపోవడం ప్రజల్లో తప్పు సంకేతాలు పంపుతుందని పేర్కొంది. అర్హత కలిగిన మరో అధికారిని వెంటనే హైడ్రా కమిషనర్‌గా నియమించాలని సూచించింది. చట్ట పాలనను కాపాడేందుకు ఈ నిర్ణయం అవసరమని స్పష్టం చేసింది.

### కీలక మలుపు

లోతుకుంట భూముల కేసు విచారణ హైడ్రా వ్యవస్థ పనితీరుపై కీలక ప్రశ్నలు లేవనెత్తింది. కోర్టు ఉత్తర్వుల అమలు విషయంలో ప్రభుత్వ యంత్రాంగం మరింత బాధ్యతగా వ్యవహరించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. రంగనాథ్ క్షమాపణలు తెలిపినా, వరుస కోర్టు ధిక్కరణ కేసుల నేపథ్యంలో ఆయనను పదవిలో కొనసాగించడం సమంజసం కాదనే అభిప్రాయాన్ని హైకోర్టు వెల్లడించింది. ఈ ఆదేశాలతో హైడ్రా వ్యవహారంలో మలుపు చోటుచేసుకుంది.

## రంగనాథ్‌కు రేవంత్ అండ

- **అప్పీల్‌కు సర్కార్ సిద్ధం**

లోతుకుంట భూముల కేసులో హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌ను పదవి నుంచి తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో రేవంత్ ప్రభుత్వం న్యాయపరమైన పోరాటానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. రంగనాథ్‌కు ప్రభుత్వం మద్దతుగా నిలవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై న్యాయ నిపుణుల అభిప్రాయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించినట్లు సమాచారం. హైకోర్టు పూర్తి తీర్పు కాపీ అందిన తర్వాత సింగిల్ బెంచ్ తీర్పును డివిజన్ బెంచ్‌లో సవాలు చేసే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ క్రమంలో తెలంగాణ ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్ కుమార్‌ను న్యూఢిల్లీకి పంపినట్లు తెలుస్తోంది. గతంలో నమోదైన కోర్టు ధిక్కరణ పిటిషన్లను కూడా అధికారులు అధ్యయనం చేస్తున్నారు. లోతుకుంట భూముల కేసు విచారణ సందర్భంగా హైకోర్టు రంగనాథ్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆయనపై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉండటాన్ని ప్రస్తావించిన ధర్మాసనం, ఇలాంటి అధికారి అదే పదవిలో కొనసాగడం సమంజసం కాదని పేర్కొంది. అర్హత కలిగిన మరో అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని ప్రభుత్వానికి సూచించింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకునే తదుపరి నిర్ణయం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

## హైడ్రా రద్దు చేయడమే పరిష్కారం

- బడాబాబులకు మినహాయింపా?
- హైకోర్టు తీర్పుపై బీజేపీ రియాక్షన్

హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌ను తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఘాటుగా స్పందించారు. ఈ తీర్పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టులాంటిదని వ్యాఖ్యానించారు. రంగనాథ్‌ను బలిపశువుగా మార్చారని ఆరోపించారు. హైడ్రా చర్యలు మొదటి నుంచి పేదల ఇళ్లపైనే కేంద్రీకృతమయ్యాయని రాంచందర్ రావు విమర్శించారు. ఫాతిమా కాలేజీ వంటి వివాదాస్పద నిర్మాణాలు, బడాబాబుల ఆక్రమణల జోలికి హైడ్రా వెళ్లలేదని ఆరోపించారు. రేవంత్ ప్రభుత్వం, ఎంఐఎం కనుసన్నల్లోనే హైడ్రా పనిచేసిందని అన్నారు. రాష్ట్రంలో హైడ్రాను నిషేధిస్తేనే పేదల ఇళ్లు సురక్షితంగా ఉంటాయని పేర్కొన్నారు. లోతుకుంట భూముల కేసు విచారణలో హైకోర్టు రంగనాథ్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు ఉత్తర్వులను పదేపదే ఉల్లంఘించిన అధికారిని అదే పదవిలో కొనసాగించడం సమంజసం కాదని స్పష్టం చేసింది. అర్హత కలిగిన మరో అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో హైడ్రాను పూర్తిగా రద్దు చేయాలని రేవంత్ ప్రభుత్వాన్ని తెలంగాణ బీజేపీ డిమాండ్ చేసింది.

## ప్రభుత్వానికి చెంపపెట్టు!

- రేవంత్ సర్కారు వైఫల్యమన్న బీఆర్ఎస్

హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌ను పదవి నుంచి తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర విమర్శలు చేశారు. ఇది ఒక్క అధికారిపై వచ్చిన తీర్పు కాదని, రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యంపై హైకోర్టు చేసిన తీవ్రమైన వ్యాఖ్యగా చూడాలని అన్నారు. హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని వ్యాఖ్యానించారు. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉండటం చిన్న విషయం కాదని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఇలాంటి అధికారిని అదే పదవిలో కొనసాగిస్తే రూల్ ఆఫ్ లా దెబ్బతింటుందని హైకోర్టు స్పష్టంగా చెప్పిందని గుర్తు చేశారు. ఆయన స్థానంలో అర్హత కలిగిన అధికారిని నియమించాలని న్యాయస్థానం సూచించడం ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక అని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూల్చివేతల ప్రభుత్వంగా మారిందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. లగచర్ల, వెలుగుమట్ల, సున్నం చెరువు, బహదూర్‌గూడ, లోతుకుంట ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. హైడ్రా పేరుతో పేదలే ఎక్కువగా నష్టపోయారని విమర్శించారు. భూభారతి పోర్టల్ ద్వారా వేల ఎకరాల భూముల హక్కులు నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేశారని ఆరోపించిన ఆయన, ప్రభుత్వ అధికారులు రాజ్యాంగాన్ని గౌరవించాలని, చట్టాన్ని పాటించాలని, కోర్టు ఆదేశాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించవద్దని విజ్ఞప్తి చేశారు.

## రాజ్యాంగమే నా బలం..!

- హైకోర్టు తీర్పుపై స్పందించిన రంగనాథ్

తెలంగాణ హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. తాను పూర్తిగా రాజ్యాంగ స్ఫూర్తితోనే విధులు నిర్వహిస్తున్నానని స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 48ఏ ప్రకారమే ప్రభుత్వ భూములు, చెరువులు, పర్యావరణాన్ని పరిరక్షిస్తున్నట్లు తెలిపారు. నిజాయితీ, నిర్భయంతో పనిచేయడమే హైడ్రా బలమని చెప్పారు. ఇప్పటి వరకు లక్షన్నర కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను కాపాడామని రంగనాథ్ వెల్లడించారు. ఆరు చెరువులను పూర్తిగా పునరుద్ధరించామని, మరో 20 చెరువుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. వేల ఎకరాల ప్రభుత్వ భూములను తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొచ్చామని వివరించారు. లోతుకుంటలో రూ.10 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడామని పేర్కొన్నారు. భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవడంతోనే హైడ్రాపై దాడులు జరుగుతున్నాయని రంగనాథ్ ఆరోపించారు. ల్యాండ్ మాఫియా తప్పుడు సమాచారంతో కోర్టులను తప్పుదోవ పట్టిస్తోందని అన్నారు. హెరిటేజ్ గుట్టలను అనుమతులు లేకుండా పేల్చివేశారని విమర్శించారు. స్థానికుల ఫిర్యాదుల ఆధారంగానే హైడ్రా చర్యలు చేపట్టిందని స్పష్టం చేశారు. తనపై మొత్తం 63 కోర్టు ధిక్కరణ కేసులు నమోదయ్యాయని గుర్తు చేసిన రంగనాథ్, వాటన్నింటినీ చట్టపరంగా ఎదుర్కొంటానని తెలిపారు. కోర్టులపై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. ప్రభుత్వం ఏ బాధ్యత అప్పగించినా వంద శాతం ఫలితాలు అందిస్తానని చెప్పారు.

# ఇంటింటికీ టీడీపీ జోరు



- **కూటమి పాలనకు ప్రజా మద్దతు**

తూర్పుగోదావరి జిల్లా తొండంగి మండలంలో "ఇంటింటికీ తెలుగుదేశం - రెండేళ్ల నమ్మకం" ప్రచార కార్యక్రమానికి టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్ శ్రీకారం చుట్టారు. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు సారథ్యంలో, జననేత్రి యనమల దివ్య ఆధ్వర్యంలో తుని నియోజకవర్గంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని పార్టీ నేతలు తెలిపారు. కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లిన యనమల రాజేష్, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్ల వంటి సంక్షేమ పథకాల లబ్ధిదారులను నేరుగా కలిసి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరుతున్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో యనమల దివ్య నిర్వహిస్తున్న ప్రజాదర్బార్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని స్థానికులు వెల్లడించారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారమయ్యాయని, ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా యనమల దివ్య గుర్తింపు పొందారని ప్రశంసించారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకెళ్తోందని యనమల రాజేష్ అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో నాగం పరమేష్, కంద మురళి, పక్కుర్తి నూకరాజు, పక్కుర్తి వంశీ కృష్ణ, గొరకపూడి సత్యనారాయణ, ఎలుగుబంటి నాగేశ్వరరావు, నేమాల కృష్ణతో పాటు పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఇంటింటికీ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.



# సామాజిక సేవకు ఘన గౌరవం..

- **కరుణ్ రాజుకు 'రాజ సింహ అవార్డు–2026'**



పిఠాపురానికి చెందిన లిటిల్ స్టార్స్ రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ టి. కామేశ్వరరావు (కరుణ్ రాజు)కి విశిష్ట సామాజిక సేవలకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక 'రాజ సింహ అవార్డు-2026' లభించింది. హైదరాబాద్ సమీపంలోని యాదగిరిగుట్ట న్యూ గుండ్లవెల్లిలో ఉన్న కె.యం. గ్రాండ్ హోటల్ ఫంక్షన్ హాల్‌లో ఆదర్శ కళానిలయం సంస్థ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖులను ఈ కార్యక్రమంలో సత్కరించారు. ప్రభుత్వ విప్, అలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఆదర్శ కళానిలయం సంస్థ ఛైర్మన్ డాక్టర్ సి.హెచ్. ప్రకాశ్ చేతుల మీదుగా కరుణ్ రాజు ఈ అవార్డును అందుకున్నారు. విద్య, సామాజిక సేవ, గ్రామీణాభివృద్ధి రంగాల్లో ఆయన చేస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ గౌరవం ప్రకటించారు.

అవార్డు స్వీకరించిన అనంతరం కరుణ్ రాజు మాట్లాడుతూ, లిటిల్ స్టార్స్ రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు లభించిన ఈ గుర్తింపు తనపై మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. భవిష్యత్తులో కూడా సమాజ అభ్యున్నతే లక్ష్యంగా మరింత అంకితభావంతో సేవలు కొనసాగిస్తానని తెలిపారు. ట్రస్ట్ కార్యకలాపాలకు ఆర్థికంగా, నైతికంగా తోడ్పడుతున్న దాతలు, సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, మీడియా ప్రతినిధులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పిఠాపురానికి చెందిన ప్రజాప్రతినిధులు, సామాజిక సేవా సంస్థల నాయకులు, పలువురు ప్రముఖులు కరుణ్ రాజును అభినందించారు. ఆయన సేవలు మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తాయని కొనియాడారు.

# అమరావతి ఛాంపియన్షిప్‌కు శ్రీకారం..

- **రాజపూడిలో క్రీడోత్సాహం**

జగ్గంపేట మండలం రాజపూడి హైస్కూల్‌లో అమరావతి ఛాంపియన్షిప్-2026 క్రీడా పోటీలను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సోమవారం ప్రారంభించారు. రాష్ట్రంలో విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత కల్పించాలనే లక్ష్యంతో మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ స్పోర్ట్స్ కన్వీనర్ జి. నాగమణి ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ పోటీలు ఆగస్టు 26 వరకు 12 విభాగాల్లో జరగనున్నాయి. 17 ఏళ్లలోపు, 23 ఏళ్లలోపు వయో విభాగాల్లో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను గుర్తించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఈ పోటీలు వేదికగా నిలుస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ, చదువుతో పాటు క్రీడల్లో రాణించిన యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. స్పోర్ట్స్ కోటా ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అమరావతిని క్రీడా రాజధానిగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యార్థులకు క్రీడా శిక్షణ అందిస్తూ ప్రతిభను తీర్చిదిద్దుతున్న పీడీ నాగమణి సేవలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, శ్యాప్ కోచ్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు.



# ఇంటింటికీ కూటమి

- **ప్రజలతో ఎమ్మెల్యే నెహ్రూ మమేకం**



జగ్గంపేట మండలం మల్లిసాల గ్రామంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన సందర్భంగా "నమ్మకం-అభివృద్ధి-ఇంటింటికీ సంక్షేమం" కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతు భరోసా, ఉచిత పంటల బీమా, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా, మహిళా సాధికారత, దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు, స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక చేయూత, యువతకు నైపుణ్యాభివృద్ధి, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, ఆరోగ్యశ్రీ విస్తరణ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన వంటి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి పది ప్రధాన సమస్యలను నమోదు చేసుకున్నామని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. వాటిని దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామీణ రహదారులు, తాగునీరు, ఇళ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ, సంక్షేమ పింఛన్ల పెంపు, ఇంటి వద్దకే పంపిణీ వంటి కార్యక్రమాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజా సంక్షేమ కార్యక్రమాలు రాష్ట్ర అభివృద్ధికి బలంగా నిలిచాయని అన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ పారదర్శక పాలన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కూటమి కార్యకర్తలు, అధికారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఇంటింటికీ ఎమ్మెల్యే..

## హామీల అమలుపై ప్రజల అభిప్రాయాల సేకరణ

- ప్రజల గడపలో ప్రభుత్వం, హామీల అమలుపై ఆరా
- ప్రజల్లోకి కూటమి కార్యక్రమం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తైన సందర్భంగా రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు చేపట్టిన ఇంటింటి ప్రచార కార్యక్రమం ప్రొద్దుటూరులో కొనసాగింది. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి సోమవారం పాల్గొన్నారు. ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీ భగత్‌సింగ్ కాలనీలో టీడీపీ నియోజకవర్గ అబ్జర్వర్ కొండవీటి భావనాతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను నేరుగా కలిశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 'తల్లికి వందనం', ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, సామాజిక పింఛన్లు వంటి సంక్షేమ పథకాల లబ్ధి ప్రజలకు సక్రమంగా అందుతోందా అనే అంశంపై ఎమ్మెల్యే వివరాలు తెలుసుకున్నారు. పథకాల అమలుపై ప్రజల అభిప్రాయాలను స్వయంగా అడిగి తెలుసుకుంటూ వారి స్పందనను నమోదు చేశారు.

**హామీల అమలుపై ప్రజల స్పందన**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలవుతున్నాయా? ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరుతున్నాయా? అనే అంశాలపై ప్రజలతో చర్చించారు. ప్రజల అభిప్రాయాలను స్వీకరించి, ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, టీడీపీ నాయకులు బచ్చల ప్రతాప్, బీజేపీ నాయకుడు ప్రదీప్ కుమార్ రెడ్డి, జనసేన నాయకుడు శివకుమార్, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమవుతూ ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.

# ఈ తరం.. ఎవరి తీరం..

# జెన్-జీ ఎటువైపు?

### వారసత్వం కాదు... జవసత్వమే బలం..





తెలంగాణ రాజకీయాలు కొత్త దశలోకి అడుగుపెడుతున్నాయి. ఇప్పుడు చర్చ పార్టీల గురించి మాత్రమే కాదు... కొత్త తరం ఆలోచనల గురించి కూడా. ఒకప్పుడు నాయకుడి ఇంటి పేరు, కుటుంబ వారసత్వం, కుల సమీకరణాలు ఎన్నికలను ప్రభావితం చేసేవి. ఇప్పుడు జెన్‌జీ ఓటర్లు మరో ప్రశ్న అడుగుతున్నారు. "ఏం చేశారు?" ఇదే కొత్త రాజకీయ ప్రమాణంగా మారుతోంది. సోషల్ మీడియాతో పెరిగిన ఈ తరం భావోద్వేగాల కంటే పనితీరును, హామీల కంటే ఫలితాలను, వారసత్వం కంటే జవసత్వాన్ని కొలుస్తోంది. అవినీతిని ప్రశ్నించే నాయకుడు, ఉద్యోగాలపై స్పష్టమైన కార్యాచరణ చూపించే ప్రభుత్వం, ప్రజల్లో కనిపించే రాజకీయ నాయకత్వానికే ఈ తరం ప్రాధాన్యం ఇస్తోంది. అందుకే 2029 ఎన్నికల అసలు పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య మాత్రమే కాదు. పాత రాజకీయ శైలి, కొత్త జెన్‌జీ ఆలోచనల మధ్య కూడా. ప్రజల విశ్వాసాన్ని సంపాదించిన నాయకత్వమే రేపటి తెలంగాణను నడిపించబోతోంది. ఈ తరం వారసత్వాన్ని కాదు... జవసత్వాన్ని కోరుతోంది. అదే రాబోయే రాజకీయాల దిశను నిర్ణయించే అసలైన శక్తిగా మారుతోంది.

# ముక్కుసూటితనమే రాజముద్ర..!

తెలంగాణ రాజకీయాల్లో కొందరు నాయకులు పదవులతో గుర్తింపు తెచ్చుకుంటే, మరికొందరు తమ వ్యక్తిత్వంతో ప్రత్యేక ముద్ర వేస్తారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రెండో కోవకు చెందిన నాయకుడిగా రాజకీయ వర్గాల్లో గుర్తింపు పొందారు. ఏ పార్టీ అయినా, ఏ పదవి అయినా తన అభిప్రాయాన్ని నేరుగా చెప్పడం ఆయన రాజకీయ శైలిగా నిలిచింది. అందుకే ఆయన పేరు వినిపిస్తే ముందుగా గుర్తొచ్చేది ముక్కుసూటితనం. ప్రజా సమస్యలపై స్పందించడం, అధికారాన్ని ప్రశ్నించడం, క్షేత్రస్థాయిలో కనిపించడం ద్వారా తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. మునుగోడు ఉప ఎన్నిక తర్వాత తెలంగాణ రాజకీయాల్లో వచ్చిన మార్పుల చర్చలో కూడా ఆయన పాత్ర తరచూ ప్రస్తావనకు వస్తోంది. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉన్న వేళ రాజగోపాల్ రెడ్డికి పార్టీ ఎలాంటి ప్రాధాన్యం ఇస్తుందన్న చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. ఇదే సమయంలో పెద్ద రాజకీయ ప్రసంగాల కంటే స్పష్టంగా మాట్లాడే నాయకులను ఇష్టపడుతున్న జెన్‌జీకి కూడా ఆయన రాజకీయ శైలి దగ్గరగా ఉందనే అభిప్రాయం వినిపిస్తోంది. అందుకే ఇప్పుడు చర్చ కేవలం రాజగోపాల్ రెడ్డికి పదవి దక్కుతుందా అన్నదానిపైనే కాదు. ప్రజల్లో గుర్తింపు ఉన్న నాయకులను కాంగ్రెస్ ఎలా వినియోగించుకుంటుంది, వారి అనుభవానికి ఎంత విలువ ఇస్తుందన్న అంశంపైనా రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



6లో..

హైడ్రా అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపిందనే ప్రచారం ఎంత బలంగా సాగిందో, ఇప్పుడు అదే హైడ్రా చట్టాన్ని ఉల్లంఘించిందా అనే ప్రశ్న అంతే తీవ్రంగా వినిపిస్తోంది. లోతుకుంట భూముల వ్యవహారంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయకుండా పదేపదే ఉల్లంఘించారన్న ఆరోపణలపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం రాజకీయంగా పెద్ద ప్రకంపనలు రేపింది. ఒకటి కాదు... రెండు కాదు... ఏకంగా 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఎందుకు వచ్చాయి? అని న్యాయస్థానం నేరుగా ప్రశ్నించడం కేసు తీవ్రతను స్పష్టంగా చూపించింది. కోర్టు ఉత్తర్వులను కాపాడాల్సిన ఉన్నతాధికారి వాటినే ఉల్లంఘిస్తే చట్ట పాలన ఎలా నిలుస్తుందని ధర్మాసనం నిలదీసింది. అదే కారణంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. అయితే ప్రభుత్వం వెనక్కి తగ్గే సంకేతాలు ఇవ్వకుండా రంగనాథ్‌కు అండగా నిలిచి డివిజన్ బెంచ్‌లో అప్పీల్‌కు సిద్ధమవుతోంది. ఇదే సమయంలో బీజేపీ హైడ్రా పేదల ఇళ్లపైనే బుల్డోజర్ నడిపిందని, బడాబాబుల జోలికి వెళ్లలేదని ఆరోపిస్తూ సంస్థనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తోంది. మరోవైపు బీఆర్ఎస్ మాత్రం ఇది ఒక్క అధికారిపై వచ్చిన తీర్పు కాదని, రేవంత్ ప్రభుత్వ పరిపాలనా వైఫల్యానికి హైకోర్టు ఇచ్చిన గట్టి హెచ్చరిక అని విమర్శిస్తోంది. రంగనాథ్ హైకోర్టుకు క్షమాపణలు చెప్పినా పరిస్థితి చేజారిపోయింది. న్యాయస్థానం తీర్పు, ప్రభుత్వ వైఖరి, ప్రతిపక్షాల దాడులతో ఇప్పుడు హైడ్రా చుట్టూ న్యాయపోరాటం, రాజకీయ పోరాటం ఒకేసారి ముదురుతున్నాయి.

వివరాలు 3లో..




# రంగనాథుడికి మంగళం పాడిన హైకోర్టు

## "హైడ్రా"మా ఆపండి..

- హైడ్రా కమిషనర్‌ను తొలగించండి
- పదేపదే కోర్టు ఉల్లంఘనలకు పాల్పడడంపై ఆగ్రహం
- ఇలాంటి వ్యక్తి అదే పోస్టులో కొనసాగడం సరికాదు
- లోతుకుంట భూముల వ్యవహారంపై హైకోర్టు విచారణ
- కోర్టులంటే గౌరవం ఉందంటూ క్షమాపణలు కోరిన రంగనాథ్

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. పదేపదే కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తున్న అధికారిని అదే పదవిలో కొనసాగించడం సమంజసం కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలను అమలు చేయాల్సిన ఉన్నతాధికారి వాటినే ధిక్కరించడం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని వ్యాఖ్యానించింది.

**63 ధిక్కరణ పిటిషన్లపై ప్రశ్నలు**

రంగనాథ్‌పై ఇప్పటికే 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు పెండింగ్‌లో ఉండటం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని హైకోర్టు పేర్కొంది. ఇన్ని ధిక్కరణ కేసులు ఎందుకు నమోదయ్యాయో ప్రభుత్వం తరఫు న్యాయవాదిని నేరుగా ప్రశ్నించింది. కోర్టులను ఆశ్రయించడం ప్రతి పౌరుడి హక్కు అని గుర్తు చేసిన ధర్మాసనం, ఆ హక్కును ప్రభుత్వ యంత్రాంగం గౌరవించాల్సిన బాధ్యత మరింత ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేసింది.

**రంగనాథ్‌కు రేవంత్ అండ..!**
**అప్పీల్‌కు సర్కార్ సిద్ధం**

**హైడ్రా రద్దు చేయడమే పరిష్కారం..!**
**బడాబాబులకు మినహాయింపా?**
**హైకోర్టు తీర్పుపై బీజేపీ రియాక్షన్**

**హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు!**
**రేవంత్ సర్కారు వైఫల్యమన్న బీఆర్ఎస్**

# ఏం జేస్తారో చేయండి

## 'పెద్దిని కాపాడండి'..! • వైద్యులకు కేసీఆర్ విజ్ఞప్తి

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి చేరుకుని పార్టీ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వైద్యులతో నేరుగా మాట్లాడి చికిత్స వివరాలపై ఆరా తీశారు. అనంతరం కుటుంబ సభ్యులను కలిసి మనోధైర్యం నింపారు. కేసీఆర్ వెంట హరీశ్ రావు, కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, సత్యవతి రాథోడ్, పల్లా రాజేశ్వర్ రెడ్డి సహా పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

(వివరాలు 5లో..)






# ప్రభుత్వం విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి..!

### మోదీ సర్కారుపై రాహుల్ తీవ్ర విమర్శలు

దేశవ్యాప్తంగా ప్రశ్నాపత్రాల లీకేజీలపై ఆందోళనలు చేస్తున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం అణచివేతకు పాల్పడుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. విద్యార్థులపై కాల్పులు, లాఠీచార్జీలు, కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశంలోని ప్రతి విద్యార్థికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు.

(వివరాలు 5లో..)

# నిరసన పౌరుల హక్కు

- తేల్చి చెప్పిన సుప్రీంకోర్టు
- పోలీసు చర్యలపై మార్గదర్శకాలు

5లో..



# మెట్రో సేవలకు కొత్త మెరుగులు..!

### 10 స్టేషన్లు మోడల్‌గా తీర్చిదిద్దే ప్రణాళిక



5లో..



# ఫ్యామిలీ రిజిస్టర్‌కు గ్రీన్ సిగ్నల్..!

### • మీ సేవలో కొత్త సర్టిఫికెట్ • తెలంగాణలో కొత్త డిజిటల్ సేవ

తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు మరో కీలక డిజిటల్ సేవను అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రానిక్ తెలంగాణ ఫ్యామిలీ రిజిస్టర్ వ్యవస్థను ప్రారంభించింది. దీని ఆధారంగా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ (ఎఫ్‌ఆర్‌సీ) జారీ చేయనుంది. ఆహార భద్రత కార్డు ఉన్న కుటుంబాల వివరాలను ఒకే డిజిటల్ రికార్డులో భద్రపరచడం ద్వారా ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయడమే ఈ నిర్ణయం లక్ష్యం. (వివరాలు 2లో..)




5లో..

# కరెప్షన్ షాక్ ట్రీట్మెంట్

### • అవినీతి అధికారుల జల్లెడ • నిఘా నీడలో 100 మంది వేటాడి వెంటాడుతున్న ఏసీబీ • పూర్తి స్థాయిలో దాడులకు సిద్ధం



# సింగరేణిని నష్టాల్లోకి నెట్టారు..!

### కేసీఆర్, కాంగ్రెస్‌పై కిషన్‌రెడ్డి ఫైర్

సింగరేణి సంస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్రంగా దెబ్బతీసిందని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పరిస్థితుల్లో పెద్దగా మార్పు కనిపించడం లేదని విమర్శించారు. కేంద్రానికి 49 శాతం, తెలంగాణ ప్రభుత్వానికి 51 శాతం వాటా ఉన్న సింగరేణి దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు సంస్థ అని గుర్తు చేశారు. సింగరేణి బొగ్గు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఎన్‌టీపీసీకి సరఫరా అవుతుందని చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం బొగ్గు గనుల వేలంలో పాల్గొనకుండా కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో కొత్త బొగ్గు బ్లాకులు కోల్పోయిందని ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం సింగరేణిని ఉపయోగించారని విమర్శించారు. (5లో..)

# విద్యాశాఖ యశస్వినికే ఇవ్వాలి..!

### రేవంత్‌పై రామచందర్ రావు ఫైర్

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థులు, యువత భవిష్యత్తుతో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెలగాటమాడుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఆరోపించారు. రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, నిరుద్యోగ భృతి, రెండు లక్షల ఉద్యోగాల హామీలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ, హోంశాఖ, న్యాయశాఖలను సీఎం సమర్థంగా నిర్వహించలేకపోతున్నారని విమర్శించారు. ఈ వైఫల్యాన్ని అంగీకరించి యువ ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి విద్యాశాఖ బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాన్ని పక్కదారి పట్టించేందుకే 21 ఏళ్లకే ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసే ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చారని ఆరోపించారు. (5లో..)





# బంగాళాఖాతంలో అల్పపీడనం

### • నాలుగు రోజుల పాటు వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడటంతో తెలంగాణలో వచ్చే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.

(వివరాలు 2లో..)

# నిరసన పౌరుల హక్కు

- తేల్చి చెప్పిన సుప్రీంకోర్టు
- పోలీసు చర్యలపై మార్గదర్శకాలు



దేశవ్యాప్తంగా పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలపై జరిగిన ఆందోళనల నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రశాంతంగా నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని స్పష్టం చేసింది. కేవలం నిరసన జరుగుతోందనే కారణంతో పోలీసుల నుంచి అతిగా బలప్రయోగం ఉండకూడదని పేర్కొంది. భారీ నిరసనల్లో పోలీసులు ఎలా వ్యవహరించాలనే అంశంపై దేశవ్యాప్తంగా అమలు అయ్యే ఏకరీతి మార్గదర్శకాలను రూపొందించే అంశాన్ని పరిశీలిస్తామని వెల్లడించింది.

**• జులై 20 ఘటనపై విచారణ**

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ప్రజాస్వామ్యంలో నిరసన హక్కు ఎంత ముఖ్యమో, పోలీసుల భద్రత కూడా అంతే కీలకమని వ్యాఖ్యానించింది. ఆందోళనకారులు, పోలీసు సిబ్బంది ఇద్దరూ క్రమశిక్షణ పాటించాలని సూచించింది. ఎక్కడైనా పోలీసు దుర్వినియోగం జరిగితే స్వతంత్రంగా విచారణ జరగాలని స్పష్టం చేసింది. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీపై జులై 20న పార్లమెంట్ వైపు జరిగిన నిరసనలో పోలీసుల లాఠీచార్జ్, బలప్రయోగంపై దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు విచారించనుంది. బిహార్‌లో జరిగిన బంద్ సందర్భంగా కాల్పులు జరిగాయన్న ఆరోపణలు కూడా ఈ విచారణలో భాగం కానున్నాయి. ఈ ఘటనలపై సమగ్రంగా విచారణ చేపట్టాలని పిటిషనర్లు కోరారు.

**• జులై 28న తుది విచారణ**

ప్రశ్నాపత్రాల లీకేజీ వివాదం దేశవ్యాప్తంగా రాజకీయ చర్చకు దారితీయడంతో కేంద్ర విద్యాశాఖలో మార్పులు చోటుచేసుకున్నాయి. కొత్త విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కేంద్ర ప్రభుత్వం ప్రజా పరీక్షల చట్ట సవరణ బిల్లును తీసుకొచ్చింది. ప్రశ్నాపత్రాల లీకేజీ వంటి అక్రమాలకు ప్రస్తుతం ఉన్న శిక్షను మరింత కఠినతరం చేయాలని ప్రతిపాదించింది. జైలు శిక్షను ఐదు నుంచి పది సంవత్సరాలకు పెంచడంతో పాటు గరిష్ఠ జరిమానాను రూ.50 లక్షలకు పెంచే ప్రతిపాదనలు చేసింది. నిరసనల సందర్భంగా పోలీసు దుర్వినియోగం జరిగిందన్న ఆరోపణలు, ఆందోళనల్లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు, పోలీసు సిబ్బందిపై జరిగిన దాడులు సహా అన్ని పిటిషన్లను జులై 28న ఒకేసారి విచారించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. ప్రజాస్వామ్యంలో ప్రశాంత నిరసన హక్కును కాపాడుతూ, చట్టవ్యవస్థను కూడా పరిరక్షించే సమతుల్య విధానం అవసరమని ధర్మాసనం స్పష్టం చేసింది.

# ఏం జేస్తారో చేయండి

- 'పెద్దిని కాపాడండి'..!
- వైద్యులకు కేసీఆర్ విజ్ఞప్తి

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి చేరుకుని పార్టీ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వైద్యులతో నేరుగా మాట్లాడి చికిత్స వివరాలపై ఆరా తీశారు. అనంతరం కుటుంబ సభ్యులను కలిసి మనోధైర్యం నింపారు. కేసీఆర్ వెంట హరీశ్ రావు, కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, సత్యవతి రాథోడ్, పల్లా రాజేశ్వర్ రెడ్డి సహా పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

**'ఏం జేస్తరో చేయండి'**

వైద్యులను ఉద్దేశించి కేసీఆర్ భావోద్వేగంగా స్పందించారు. "ఏం జేస్తరో చేయండి... మా పెద్దిని కాపాడండి" అంటూ చేతులెత్తి నమస్కరించారు. దేవుడి దయ, వైద్యుల కృషితో పెద్ది సుదర్శన్ రెడ్డి కోలుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు ఆందోళన చెందొద్దని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. వైద్యుల వివరాల ప్రకారం పెద్ది సుదర్శన్ రెడ్డికి అత్యున్నత స్థాయి వైద్యం అందుతోంది. అవసరమైన సలహాల కోసం విదేశీ నిపుణులతో కూడా సంప్రదింపులు కొనసాగుతున్నాయి. గుండె, ఊపిరితిత్తులు సహా కీలక అవయవాలు పనిచేస్తున్నాయని, మెదడు పూర్తిగా స్పందించడానికి మరో 48 గంటలు పట్టే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఐసీయూలో నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు.

**అండగా ఉంటామని హామీ**

పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడేందుకు పార్టీ శక్తిమేర ప్రయత్నిస్తుందని కేసీఆర్ స్పష్టం చేశారు. ఖర్చు విషయంలో ఎలాంటి వెనుకంజ ఉండదని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. వైద్య బృందంతో దాదాపు 45 నిమిషాల పాటు చికిత్స తీరుపై చర్చించిన కేసీఆర్, అవసరమైన ప్రతి సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. డాక్టర్ల కృషి, ప్రజల ఆశీస్సులతో పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.





## ప్రభుత్వం విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి..!

**మోదీ సర్కారుపై రాహుల్ తీవ్ర విమర్శలు**




దేశవ్యాప్తంగా ప్రశ్నాపత్రాల లీకేజీలపై ఆందోళనలు చేస్తున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం అణచివేతకు పాల్పడుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. విద్యార్థులపై కాల్పులు, లాఠీచార్జీలు, కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశంలోని ప్రతి విద్యార్థికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు.

**విద్యార్థులపై దాడుల ఆరోపణలు**

బిహార్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఏకే 47తో కాల్పులు జరిగాయన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని రాహుల్ అన్నారు. ఢిల్లీలో పెల్లెట్ గన్స్ ఉపయోగించారనే ఆరోపణలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేసి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని విమర్శించారు. ఉత్తరప్రదేశ్, బిహార్, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్... రాష్ట్రం ఏదైనా విద్యార్థుల గొంతు నొక్కివేసే ధోరణే కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ధర్మేంద్ర ప్రధాన్‌పై విమర్శలు**

మాజీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దేశ విద్యా వ్యవస్థ వైఫల్యానికి ప్రతీకగా నిలిచారని రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రశ్నాపత్రాల లీకేజీలతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిన్నా నైతిక బాధ్యతతో రాజీనామా చేయలేదని ఆరోపించారు. యువత ఆగ్రహానికి భయపడే ఆయన పదవి వదిలారని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తిని పార్లమెంట్‌లో సన్మానించడం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనాన్ని గౌరవించినట్టేనని విమర్శించారు.

**ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం**

విద్యార్థులపై ఎలాంటి కేసులు నమోదు చేయబోమని గతంలో ఇచ్చిన హామీ ఏమైందని ప్రధాని మోదీని రాహుల్ ప్రశ్నించారు. కేసులు ఎత్తివేయడంతో పాటు అరెస్టైన విద్యార్థులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై దాడులకు బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దేశ యువత అంతా ఈ పరిణామాలను గమనిస్తోందని, ఈ ఘటనల్లో పాత్ర ఉన్న ప్రతి ఒక్కరినీ చరిత్ర గుర్తుంచుకుంటుందని రాహుల్ గాంధీ హెచ్చరించారు.

## సింగరేణిని నష్టాల్లోకి నెట్టారు..!

**• కేసీఆర్, కాంగ్రెస్‌పై కిషన్‌రెడ్డి ఫైర్**

సింగరేణి సంస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్రంగా దెబ్బతీసిందని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పరిస్థితుల్లో పెద్దగా మార్పు కనిపించడం లేదని విమర్శించారు. కేంద్రానికి 49 శాతం, తెలంగాణ ప్రభుత్వానికి 51 శాతం వాటా ఉన్న సింగరేణి దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు సంస్థ అని గుర్తు చేశారు. సింగరేణి బొగ్గు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఎన్‌టీపీసీకి సరఫరా అవుతుందని చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం బొగ్గు గనుల వేలంలో పాల్గొనకుండా కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో కొత్త బొగ్గు బ్లాకులు కోల్పోయిందని ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం సింగరేణిని ఉపయోగించారని విమర్శించారు.

**• కొత్త బ్లాకులతో ఉద్యోగాల ఆశ**

2015లో కేంద్రం ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించినా అప్పటి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం ఒడిశాలో అధికారంలోకి వచ్చిన తర్వాత అవసరమైన అనుమతులు సాధించామని చెప్పారు. తాడిచర్ల2 బ్లాక్‌ను కూడా సింగరేణికి కేటాయించామని వెల్లడించారు. మణుగూరు బ్లాక్ వేలంలో తెలంగాణ జెన్‌కో పోటీ చేయకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరుతూ లేఖ రాస్తానని తెలిపారు. ఈ మూడు బొగ్గు బ్లాకులు సింగరేణికి దక్కితే సుమారు 6,500 ఉద్యోగాలు లభిస్తాయని, 830 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తితో రూ.1.95 లక్షల కోట్ల టర్నోవర్ సాధించే అవకాశం ఉందన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కేంద్రం తీసుకొచ్చిన కఠిన చట్టాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించడం బాధాకరమని, విద్యార్థుల్లో ధైర్యం నింపడం అందరి బాధ్యత అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.



## విద్యాశాఖ యశస్వినికే ఇవ్వాలి..!

### రేవంత్‌పై రామచందర్ రావు ఫైర్



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థులు, యువత భవిష్యత్తుతో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెలగాటమాడుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఆరోపించారు. రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, నిరుద్యోగ భృతి, రెండు లక్షల ఉద్యోగాల హామీలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ, హోంశాఖ, న్యాయశాఖలను సీఎం సమర్థంగా నిర్వహించలేకపోతున్నారని విమర్శించారు. ఈ వైఫల్యాన్ని అంగీకరించి యువ ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి విద్యాశాఖ బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాన్ని పక్కదారి పట్టించేందుకే 21 ఏళ్లకే ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసే ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చారని ఆరోపించారు.

విద్యాశాఖ మంత్రిగా కొనసాగేందుకు రేవంత్ రెడ్డికి నైతిక హక్కు లేదని రామచందర్ రావు అన్నారు. కేంద్ర మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి బాధ్యత వహించారని గుర్తు చేశారు. అదే తరహాలో తెలంగాణలో విద్యార్థుల సమస్యలపై చిత్తశుద్ధి చూపాలంటే సీఎం విద్యాశాఖ బాధ్యతల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. యువతను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల వయోపరిమితిని నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ఢిల్లీలో విద్యార్థుల నిరసనల వెనుక విదేశీ హస్తం ఉందని ఆరోపిస్తూ, కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం వాస్తవాలకు దూరమని విమర్శించారు.

# కరెప్షన్ షాక్ ట్రీట్మెంట్




- అవినీతి అధికారుల జల్లెడ
- నిఘా నీడలో 100 మంది
- వేటాడి వెంటాడుతున్న ఏసీబీ
- పూర్తి స్థాయిలో దాడులకు సిద్ధం

రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ మరోసారి దూకుడు పెంచింది. చిన్నచితక కేసులతో కాకుండా భారీ అక్రమాస్తులు కూడబెట్టిన అధికారులపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇటీవల వరుస దాడులతో పలువురు ఉన్నతాధికారుల అక్రమాస్తులను గుర్తిస్తూ వందల కోట్ల రూపాయల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకుంటోంది. దీంతో అవినీతి అధికారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. అవినీతిపై ప్రభుత్వం కఠిన వైఖరి అవలంబిస్తున్న సంకేతాలుగా ఈ చర్యలను అధికారులు భావిస్తున్నారు.

**• 100 మంది అధికారులపై నిఘా**

ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్‌కు వచ్చిన ఫిర్యాదులు, ఇంటెలిజెన్స్ నివేదికలు, విజిలెన్స్ సమాచారాన్ని ఆధారంగా తీసుకుని ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టిన సుమారు 100 మంది అధికారులపై నిఘా కొనసాగుతోంది. ఇప్పటికే 65 మంది అధికారులపై ప్రాథమిక సమాచారం సేకరించినట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా రెవెన్యూ, పోలీస్, జీహెచ్ఎంసీ, ఆర్టీఏ, విద్యుత్ శాఖల అధికారులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

**• పక్కా ఆధారాల తర్వాతే చర్యలు**

గత ఆరు నెలలుగా అనుమానిత అధికారుల బ్యాంకు ఖాతాలు, స్థిరాస్తులు, కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న ఆస్తులు, బినామీ లావాదేవీలపై ఏసీబీ లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. వీడియో రికార్డింగ్‌లు, రిజిస్ట్రేషన్ పత్రాలు, బ్యాంకింగ్ లావాదేవీలు సహా పక్కా ఆధారాలు సేకరించిన తర్వాతే దాడులు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తోంది. దీంతో గతంలో లాగా సాక్ష్యాల కొరతతో కేసులు బలహీనపడకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది.

**• ప్రజల సహకారమే కీలకం**

ఇటీవల ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో పలువురు ప్రభుత్వ అధికారులపై కేసులు నమోదు చేసిన ఏసీబీ, ఇప్పటికే 10 మందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సమాచారం. ఈ చర్యలు మిగతా అధికారులకు హెచ్చరికగా మారాయని భావిస్తున్నారు. లంచం డిమాండ్ చేసినా, అక్రమాస్తులపై విశ్వసనీయ సమాచారం ఉన్నా ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. అవినీతిని పూర్తిగా అరికట్టాలంటే దాడులతో పాటు కోర్టులో బలమైన సాక్ష్యాలు సమర్పించి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చేయడమే అసలు విజయమని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

## మెట్రో సేవలకు కొత్త మెరుగులు..!

**10 స్టేషన్లు మోడల్‌గా తీర్చిదిద్దే ప్రణాళిక**



హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన, సురక్షితమైన సేవలు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించినట్లు మెట్రో రైల్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి తెలిపారు. బేగంపేట్ నుంచి రాయదుర్గ్ వరకు మెట్రోలో స్వయంగా ప్రయాణించి పలు స్టేషన్లను, వీధి స్థాయి వసతులను ఆయన పరిశీలించారు. బేగంపేట్, అమీర్‌పేట్, రాయదుర్గ్ స్టేషన్లలో ప్లాట్‌ఫామ్‌లు, కాంకోర్స్ ప్రాంతాలు, భద్రతా ఏర్పాట్లు, ప్రయాణికులకు అందుతున్న సేవలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాయదుర్గ్ స్కైవాక్, ఐటీ సంస్థలకు అనుసంధాన మార్గాలు, మైండ్‌స్పేస్ జంక్షన్ వద్ద ప్రయాణికుల రద్దీని పరిశీలించి ఉదయం, సాయంత్రం వేళల్లో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయాలని ఆదేశించారు. స్టేషన్ల కింద ఉన్న వాణిజ్య సముదాయాలు, పార్కింగ్ నిర్వహణ కూడా మరింత సమర్థంగా ఉండాలని సూచించారు.

మెట్రో స్టేషన్లలో పారిశుధ్యం, పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని అజిత్ రెడ్డి స్పష్టం చేశారు. పిల్లర్ల మధ్య ఉన్న సెంట్రల్ మెరిడియన్ నిర్వహణ, పార్కింగ్ వినియోగం, ప్రజా సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. నిర్వహణ బాధ్యతలు చేపట్టిన ఏజెన్సీలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తొలి విడతలో 10 మెట్రో స్టేషన్లను ఎంపిక చేసి అన్ని సౌకర్యాలతో మోడల్ స్టేషన్లుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. అనంతరం మిగిలిన అన్ని స్టేషన్లను కూడా దశలవారీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. భవిష్యత్తులో ప్రతి మెట్రో స్టేషన్‌ను స్వయంగా సందర్శించి ప్రయాణికులకు అందుతున్న సేవలు, భద్రత, పార్కింగ్, పరిశుభ్రతను నిరంతరం సమీక్షిస్తానని చెప్పారు. నగరవాసులకు అత్యుత్తమ ప్రయాణ అనుభవాన్ని అందించడమే హైదరాబాద్ మెట్రో ప్రధాన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం

**నాలుగు రోజుల పాటు వర్షాలు**



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడటంతో తెలంగాణలో వచ్చే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, రంగారెడ్డి, సిద్ధిపేట, కరీంనగర్, హనుమకొండ, వరంగల్ సహా పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు పడే అవకాశముందని పేర్కొంది. మిగతా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని వెల్లడించింది. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, వాగులు, వంకలు పొంగిపొర్లడం, రహదారులపై నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. అత్యవసర పరిస్థితులు మినహా వరద ప్రవాహాలు ఉన్న ప్రాంతాలకు వెళ్లవద్దని ప్రజలకు సూచించింది. ప్రస్తుతం వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత బలపడే అవకాశం ఉందని, జులై 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షాలు కొనసాగవచ్చని తెలిపింది. ఇదిలా ఉండగా జులై నెలలో రాష్ట్రంలో సాధారణంగా కురవాల్సిన 227.4 మిల్లీమీటర్ల వర్షపాతానికి బదులుగా 109.7 మిల్లీమీటర్లే నమోదై 43 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

## ఫ్యామిలీ రిజిస్టర్‌కు గ్రీన్ సిగ్నల్..!

- మీ సేవలో కొత్త సర్టిఫికెట్
- తెలంగాణలో కొత్త డిజిటల్ సేవ

**రేషన్ కార్డే ప్రధాన ఆధారం**

రెవెన్యూ శాఖ జారీ చేసిన జీవో నెం.172 ప్రకారం ఫ్యామిలీ రిజిస్టర్‌ను పౌర సరఫరాల శాఖ నిర్వహిస్తున్న రేషన్ కార్డు డేటా ఆధారంగా రూపొందిస్తారు. రేషన్ కార్డు నంబరే ఫ్యామిలీ రిజిస్టర్ గుర్తింపు సంఖ్యగా ఉంటుంది. కుటుంబ సభ్యుల పేర్లు, కుటుంబ పెద్దతో సంబంధం, వయసు, జనన తేదీ, లింగం, ఆధార్ వివరాలు, నివాస చిరునామా వంటి సమాచారం ఇందులో నమోదవుతుంది. ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్‌ను మీ సేవ కేంద్రాలు, ఆన్‌లైన్ పోర్టల్, మొబైల్ యాప్ ద్వారా పొందవచ్చు. రేషన్ కార్డు నంబర్ నమోదు చేసి నిర్ణయించిన రుసుము చెల్లిస్తే దరఖాస్తు స్వీకరిస్తారు. రెండు రోజుల్లో సర్టిఫికెట్ జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

**పేద కుటుంబాలకు ఊరట**

ఈ సేవను సమర్థంగా అమలు చేయడానికి ఫుడ్ సెక్యూరిటీ కార్డు డేటాబేస్‌తో ఏపీఐ అనుసంధానం చేపట్టాలని ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ కమిషనర్‌కు సూచించింది.

ఫ్యామిలీ రిజిస్టర్ వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు పదేపదే వివిధ పత్రాలు సమర్పించాల్సిన అవసరం తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. కుటుంబ సభ్యుల ధ్రువీకరణ ఒకే సర్టిఫికెట్ ద్వారా పూర్తికావడంతో ప్రభుత్వ పథకాలు, సేవలు పొందడం మరింత సులభమవుతుందని అధికారులు చెబుతున్నారు. జిల్లాల కలెక్టర్లు ఈ సేవ అమలును పర్యవేక్షించాలని కూడా ప్రభుత్వం ఆదేశించింది.





**తెలంగాణ రాజకీయాలు మరోసారి ఆసక్తికర మలుపు తిరుగుతున్నాయి. పదేళ్ల బీఆర్ఎస్ పాలనను చూసిన ప్రజలు ఇప్పుడు కాంగ్రెస్ పాలనను నిశితంగా గమనిస్తున్నారు. ఒకప్పుడు ఉద్యమం రాజకీయాల కేంద్ర బిందువు అయితే... ఇప్పుడు అవినీతి, పారదర్శక పాలన, ఉద్యోగాలు, పెట్టుబడులు, యువత భవిష్యత్ ప్రధాన చర్చగా మారుతున్నాయి. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా జెన్-జీ రాజకీయాల ప్రభావం పెరుగుతోంది. ఈ మార్పును ముందుగా అర్థం చేసుకునే పార్టీదే రేపటి ఆధిపత్యం. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా అసలు పరీక్ష ఇప్పుడే మొదలైంది. రేవంత్ రెడ్డి పాలనకు ప్రజల తీర్పు ఇంకా రావాల్సి ఉంది. బీఆర్ఎస్ తిరిగి పుంజుకోవడానికి వ్యూహాలు రచిస్తోంది. బీజేపీ మరో అవకాశాన్ని ఎదురుచూస్తోంది. తెలంగాణలో ఇప్పుడు అసలు పోటీ పార్టీల మధ్య మాత్రమే కాదు... పాత రాజకీయ శైలి, కొత్త జెన్-జీ రాజకీయాల మధ్య కూడా.**

దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన జంతర్ మంతర్ ఉద్యమం కేవలం ఒక నిరసన కార్యక్రమం కాదు. దేశ రాజకీయాలకు కొత్త దిశ చూపించిన సంఘటన. రాజకీయ పార్టీలు యువతను కేవలం ఓటర్లుగా చూడలేవని గుర్తు చేసిన హెచ్చరిక. ఒకప్పుడు కులాలు, ప్రాంతాలు, సంక్షేమ పథకాలు, సంప్రదాయ ఓటు బ్యాంకులు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేవి. ఇప్పుడు జెన్‌జీ ఆలోచనలే రాజకీయ సమీకరణాలను మార్చే శక్తిగా ఎదుగుతున్నాయి. ఇదే ప్రభావం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో కూడా స్పష్టంగా కనిపిస్తోంది.

### • పదేళ్ల బీఆర్ఎస్ పాలన... రెండేళ్ల కాంగ్రెస్ పాలన

తెలంగాణ ప్రజలు ఇప్పటికే రెండు విభిన్న రాజకీయ నమూనాలను చూశారు. రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమం తర్వాత పదేళ్ల పాటు కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పాలనను అనుభవించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూస్తున్నారు. ఒకవైపు ఉద్యమ రాజకీయాలు... మరోవైపు మార్పు రాజకీయాలు. ఈ రెండు దశల తర్వాత ప్రజల ఆలోచనల్లో మరో కొత్త ప్రశ్న వినిపిస్తోంది. రాష్ట్రానికి మరో ప్రత్యామ్నాయం అవసరమా? అనే చర్చ మెల్లగా మొదలవుతోంది. తెలంగాణలో ఇప్పుడు ఎక్కువగా వినిపిస్తున్న అంశాల్లో అవినీతి ఒకటి. ప్రభుత్వాలు మారుతున్నా వ్యవస్థ మారుతోందా? అధికార పార్టీ మారితే పాలనా సంస్కృతి కూడా మారుతోందా? ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు వస్తోందా? ఇవే ప్రశ్నలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో కొత్త రాజకీయ శక్తి వస్తే బాగుంటుందనే అభిప్రాయం కొంతమంది యువతలో వ్యక్తమవుతోందనే చర్చ కూడా రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

### • కొత్త పార్టీకి స్థానం ఉందా?

కొత్త పార్టీ వస్తే తెలంగాణ ప్రజలు ఆదరిస్తారా? అనే ప్రశ్నకు ఇప్పుడే స్పష్టమైన సమాధానం చెప్పలేం. కానీ రాజకీయంగా ఖాళీ స్థలం ఉందా? అనే చర్చ మాత్రం బలపడుతోంది. బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోయింది. కాంగ్రెస్ అధికారంలో ఉంది. బీజేపీ అవకాశాలను పూర్తిగా అందిపుచ్చుకోలేకపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయ ప్రత్యామ్నాయాలపై చర్చలు సహజంగానే మొదలవుతున్నాయి. కేసీఆర్ బిడ్డగా ఆయన నీడలో ఎదిగిన కల్వకుంట్ల కవిత ఇప్పుడు బీఆర్ఎస్ నుంచి వేరై కొత్త రాజకీయ వేదిక మొదలుపెట్టారు. ఎమ్మెల్సీగా ఉన్న తీన్మార్ మల్లన్న కూడా సొంత పార్టీతో బీసీ ఎజెండాతో పనిచేస్తామని ప్రకటించారు.

వ్యక్తిగత ఇమేజ్ ఒక్కటే సరిపోదని తెలంగాణ రాజకీయాలు మరోసారి నిరూపించాయి. ప్రజలు ఇప్పుడు కేవలం కుటుంబ వారసత్వాన్ని మాత్రమే చూడటం లేదు. నాయకుడి విశ్వసనీయత, ప్రజల్లో తిరిగిన అనుభవం, సమస్యలపై పోరాటం కూడా అంతే కీలకంగా మారుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరచూ 2029 ఎన్నికలను ప్రస్తావిస్తున్నారు. అంటే ఇంకా దాదాపు మూడేళ్ల సమయం ఉంది. కానీ రాజకీయాల్లో మూడు సంవత్సరాలు అంటే చాలా పెద్ద కాలం. ఒక్క ఉద్యమం పరిస్థితులను మార్చేస్తుంది. ఒక్క నాయకుడి నిర్ణయం రాజకీయ సమీకరణాలను తారుమారు చేస్తుంది. ఒక్క ప్రజా సమస్య ఎన్నికల కథనాన్ని పూర్తిగా మార్చేస్తుంది. అందుకే తెలంగాణ రాజకీయాలను ఇప్పుడే అంచనా వేయడం అంత సులభం కాదు. 2023లో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి అనేక కారణాలు ఉన్నాయి. బీఆర్ఎస్‌పై పెరిగిన వ్యతిరేకత ఒక కారణం. ప్రజల్లో మార్పు కోరిక మరో కారణం. రేవంత్ రెడ్డి నాయకత్వం కూడా కీలక అంశం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రస్తుతం ప్రభుత్వం నడపడంపై దృష్టి పెట్టారు. ఒకవైపు హామీల అమలు, మరోవైపు పరిపాలన, పెట్టుబడులు, ఉద్యోగాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వం పనిచేస్తోంది. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత సహజంగానే స్థానిక అసంతృప్తులు కూడా బయటపడుతున్నాయి. అలాంటి సమయంలో సీనియర్ నాయకుల పాత్రను ఎలా వినియోగించుకోవాలన్నది కాంగ్రెస్ ముందున్న కీలక రాజకీయ ప్రశ్నగా మారింది. జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ రాజకీయ ఇమేజ్ గతంతో పోలిస్తే బలపడుతోందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. కానీ రాష్ట్ర ఎన్నికలు ఎప్పుడూ స్థానిక అంశాల చుట్టూనే తిరుగుతాయి. తెలంగాణలో కూడా అదే పరిస్థితి. ఢిల్లీలో కనిపించే రాజకీయ ప్రభావం ఒక్కటే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తీసుకురాదు. స్థానిక నాయకత్వం, ప్రజల్లో నమ్మకం, ప్రభుత్వ పనితీరు కలిసి ముందుకు సాగాల్సి ఉంటుంది.

### • బీఆర్ఎస్‌కి ఛాన్స్ ఉందా.. బీజేపీ బలపడుతుందా?

పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఇప్పుడు ప్రతిపక్షంలో ఉంది. పార్టీ ఇంకా రాష్ట్రవ్యాప్తంగా బలమైన నిర్మాణాన్ని కలిగి ఉంది. కేడర్ కూడా పూర్తిగా చెదరిపోలేదు. కానీ ప్రజల్లో కొత్త నమ్మకాన్ని ఎలా కల్పిస్తుందన్నదే ప్రధాన సవాలు. గత పాలనపై వస్తున్న విమర్శలకు సమాధానం చెప్పడం ఒక్కటే సరిపోదు. భవిష్యత్తు గురించి కొత్త రాజకీయ కథనం కూడా నిర్మించాల్సి ఉంటుంది. తెలంగాణలో బీజేపీకి అవకాశాలు లేకపోలేదు. కానీ వచ్చిన అవకాశాలను గెలుపుగా మార్చడంలో పార్టీ ఆశించిన ఫలితాలు సాధించలేదు. నాలుగేళ్ల పాటు జనం పలు ఉపఎన్నికల్లో బీజేపీని ఆదరించినా, మునుగోడు ఓటమి తర్వాత పార్టీ డీలా పడిందనే అభిప్రాయం ఇప్పటికీ ఉంది. అదే సమయంలో జాతీయ నాయకత్వ బలం రాష్ట్ర స్థాయిలో ఎంతవరకు ప్రభావం చూపుతుందన్న ప్రశ్న కూడా కొనసాగుతోంది. కాంగ్రెస్ అధికారాన్ని నిలబెట్టుకోవాలని చూస్తోంది. బీఆర్ఎస్ తిరిగి పుంజుకోవాలని ప్రయత్నిస్తోంది. బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని కోరుకుంటోంది. మూడు పార్టీల వ్యూహాలు వేర్వేరుగా ఉన్నా లక్ష్యం మాత్రం ఒక్కటే. యువత విశ్వాసాన్ని గెలుచుకోవడం. జెన్‌జీ ఓటు ఎటు తిరిగితే రాజకీయ గాలి కూడా అదే దిశగా వీచే పరిస్థితి కనిపిస్తోంది. రాజకీయ పార్టీలు ఇప్పటి నుంచే 2029 దిశగా వ్యూహాలు సిద్ధం చేస్తున్నాయి. సభ్యత్వాలు, సోషల్ మీడియా, డిజిటల్ ప్రచారం, యువ నాయకత్వం, ప్రజా సమస్యలు... అన్నీ ఒకేసారి ముందుకు వస్తున్నాయి. కానీ చివరికి నిర్ణయించేది ఒకటే. ప్రజల్లో విశ్వాసం ఎవరు సంపాదించారు? ఆ ప్రశ్నకు సమాధానం చెప్పగలిగిన నాయకత్వమే తెలంగాణ రాజకీయాల తదుపరి అధ్యాయాన్ని రాయబోతోంది.

### • జెన్-జీ... జడ్జిమెంట్.. అవినీతి పోరాటం

రాబోయే మూడు సంవత్సరాల్లో తెలంగాణ ఓటర్ల జాబితాలో లక్షలాది మంది కొత్త యువ ఓటర్లు చేరనున్నారు. వీరు సంప్రదాయ రాజకీయ వాతావరణంలో పెరిగిన తరం కాదు. ఇంటర్నెట్ తో పెరిగిన తరం. సోషల్ మీడియాతో ఆలోచించే తరం. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో సమాచారం సేకరించే తరం. ఒక నాయకుడు ఏమి మాట్లాడాడన్న దానికంటే ఏం చేశాడన్నదే వీరికి ముఖ్యం. ఈ కారణంగానే 2029 ఎన్నికల్లో జెన్‌జీ పాత్ర గత ఎన్నికల కంటే మరింత కీలకంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు గోడలపై పోస్టర్లు కనిపించేవి. ఇప్పుడు మొబైల్ స్క్రీన్‌లపై రీల్స్ కనిపిస్తున్నాయి. ఒకప్పుడు సభలకు వేల మంది వస్తే నాయకుడు బలవంతుడని చెప్పేవారు. ఇప్పుడు ఒక వీడియోకు కోట్ల వ్యూస్ వస్తే రాజకీయ చర్చ మొదలవుతోంది. తెలంగాణలో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ప్రతి పార్టీ డిజిటల్ ప్రచారానికి ప్రత్యేక బృందాలను సిద్ధం చేస్తోంది. డేటా విశ్లేషణ, షార్ట్ వీడియోలు, ప్రత్యక్ష ప్రసారాలు, యువ ఇన్‌ఫ్లూయెన్సర్ల సహకారం... ఇవన్నీ ఎన్నికల వ్యూహంలో భాగమవుతున్నాయి. తెలంగాణలో ప్రజల చర్చల్లో ఇప్పుడు ఎక్కువగా వినిపిస్తున్న పదాల్లో అవినీతి కూడా ఒకటి. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వచ్చిన ఆరోపణలు ప్రజలు విన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను కూడా గమనిస్తున్నారు. అందుకే "ప్రభుత్వం ఎవరిదన్నది కాదు... పాలన ఎలా ఉంది?" అన్న ప్రశ్న బలపడుతోంది. అవినీతిపై విశ్వసనీయ చర్యలు తీసుకున్న పార్టీకి యువత నుంచి మంచి స్పందన వచ్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

### • కొత్త పార్టీ అవసరం ఉందా?

తెలంగాణలో నిజంగా కొత్త పార్టీ అవసరమా? అనే ప్రశ్నకు ఇప్పుడే సమాధానం చెప్పడం కష్టం. కానీ అలాంటి చర్చలు ప్రారంభం కావడం మాత్రం రాజకీయంగా చిన్న విషయం కాదు. అధికార పార్టీపై అసంతృప్తి పెరిగినప్పుడు, ప్రతిపక్షం ఆ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోలేకపోయినప్పుడు, ప్రజలు ప్రత్యామ్నాయాల గురించి ఆలోచించడం సహజం. ప్రస్తుతం తెలంగాణలో అలాంటి చర్చలు వినిపించడం కూడా అదే కోణంలో చూడాల్సి ఉంటుంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పుడే మధ్య దశలోకి అడుగుపెడుతోంది. ఎన్నికల హామీలు, అభివృద్ధి, ఉద్యోగాలు, పెట్టుబడులు, సంక్షేమం... ప్రతి అంశంలో ప్రజలు ఫలితాలు ఆశిస్తున్నారు. 2029 వరకు సమయం ఉన్నప్పటికీ ప్రజల అంచనాలు మాత్రం రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఆ అంచనాలను అందుకోవడమే కాంగ్రెస్‌కు పెద్ద సవాలు. బీఆర్ఎస్‌కు ఇప్పటికీ బలమైన కేడర్ ఉంది. కేసీఆర్ ఇప్పటికీ తెలంగాణ రాజకీయాల్లో ప్రభావవంతమైన నాయకుడు. కానీ గత పాలనపై ప్రజల్లో ఏర్పడిన అభిప్రాయాన్ని మార్చడం అంత సులభం కాదు. కేవలం విమర్శలతో కాదు... కొత్త రాజకీయ కథనంతోనే తిరిగి ప్రజల్లోకి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. తెలంగాణలో బీజేపీకి రాజకీయ స్థలం ఇంకా పూర్తిగా మూసుకుపోలేదు. కానీ అవకాశాలు వచ్చిన ప్రతిసారి వాటిని విజయంగా మార్చలేకపోయిందనే విమర్శలు ఉన్నాయి. స్థానిక నాయకత్వాన్ని బలోపేతం చేయడం, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేయడం, విశ్వసనీయ ప్రత్యామ్నాయంగా నిలవడం పార్టీకి కీలకంగా మారింది. రాబోయే ఎన్నికలు కేవలం కేసీఆర్, రేవంత్ రెడ్డి, బీజేపీ నాయకత్వం మధ్య పోటీగా మాత్రమే ఉండే అవకాశం లేదు. అది పాలనా నమూనాల మధ్య పోటీగా మారే అవకాశముంది. అభివృద్ధి వర్సెస్ అవినీతి ఆరోపణలు. సంక్షేమం వర్సెస్ ఉద్యోగాలు. సంప్రదాయ ప్రచారం వర్సెస్ డిజిటల్ ప్రచారం. భావోద్వేగం వర్సెస్ పనితీరు. ఈ నాలుగు అంశాలే ఎన్నికల చర్చను నడిపించే అవకాశం ఉంది.

### • తెలంగాణ తీర్పు మారుతోందా?

ఒకప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఉద్యమమే ప్రధాన అజెండా. తర్వాత రాష్ట్ర నిర్మాణం అజెండాగా మారింది. ఇప్పుడు పరిపాలన, పారదర్శకత, ఉద్యోగాలు, పెట్టుబడులు, అవినీతి నియంత్రణ, జీవన ప్రమాణాలు ప్రధాన అంశాలుగా మారుతున్నాయి. ఇదే జెన్‌జీ రాజకీయాల ప్రభావం. ప్రజలు ఇప్పుడు నాయకుడి ఇంటి పేరు కంటే నాయకుడి పనిని కొలుస్తున్నారు. వారసత్వం కంటే విశ్వసనీయతను చూస్తున్నారు. నినాదాల కంటే ఫలితాలను అడుగుతున్నారు. ఇదే మార్పును ముందుగానే అర్థం చేసుకున్న రాజకీయ శక్తికే రేపటి తెలంగాణలో ఆధిక్యం దక్కే అవకాశం ఉంది. కాంగ్రెస్ అధికారంలో ఉంది. బీఆర్ఎస్ పునరాగమనానికి ప్రయత్నిస్తోంది. బీజేపీ అవకాశం కోసం ఎదురుచూస్తోంది. 2029 ఎన్నికల్లో గెలిచేది కేవలం పెద్ద పార్టీ కాదు... ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకున్న పార్టీ. గెలిపించేది కేవలం నాయకుడి వారసత్వం కాదు... జవసత్వం ఉన్న నాయకత్వం. తెలంగాణ రాజకీయాల కొత్త అధ్యాయం ఇప్పుడు అక్కడి నుంచే మొదలవుతోంది.

### ఇంకా చాలా ఉంది

**1. తెలంగాణలో మారుతున్న ఈక్వేషన్లు**

పదేళ్ల బీఆర్ఎస్ పాలన తర్వాత కాంగ్రెస్ అధికారంలో ఉంది. ప్రజలు ఇప్పుడు ప్రభుత్వాల మార్పుకంటే పాలనలో మార్పు కోరుకుంటున్నారు. అవినీతి, ఉద్యోగాలు, పారదర్శకత, అభివృద్ధి ప్రధాన చర్చగా మారాయి. 2029 ఎన్నికల దిశగా జెన్‌జీ ప్రభావం తెలంగాణ రాజకీయాలను కొత్త మలుపు తిప్పే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**2. మూడు పార్టీలు... మూడు సవాళ్లు**

కాంగ్రెస్ అధికారాన్ని నిలబెట్టుకోవాలి. బీఆర్ఎస్ తిరిగి ప్రజల్లో నమ్మకం పెంచుకోవాలి. బీజేపీ వచ్చిన అవకాశాలను విజయంగా మార్చుకోవాలి. మూడు పార్టీల ముందున్న ప్రధాన లక్ష్యం ఒక్కటే^ జెన్‌జీ విశ్వాసాన్ని గెలుచుకోవడం. రాబోయే రాజకీయ సమీకరణాల్లో యువతే నిర్ణయాత్మక శక్తిగా మారే అవకాశం ఉంది.

**3. కొత్త పార్టీపై చర్చ... కొత్త నాయకత్వంపై ఆసక్తి**

తెలంగాణలో ప్రత్యామ్నాయ రాజకీయాలపై చర్చ మెల్లగా పెరుగుతోంది. కుటుంబ రాజకీయాల కంటే ప్రజల్లో తిరిగే, ముక్కుసూటిగా మాట్లాడే, సేవా దృక్పథం ఉన్న నాయకత్వాన్ని జెన్‌జీ ఎక్కువగా గమనిస్తోంది.

**4. 2029లో గెలిచేది ఎవరు?**

సభ్యత్వాల సంఖ్యలు, సోషల్ మీడియా ట్రెండ్‌లు, భారీ సభలు ఒక్కటే విజయాన్ని నిర్ణయించవు. ప్రజల విశ్వాసం, ప్రభుత్వ పనితీరు, యువత ఆకాంక్షలు, నాయకత్వ విశ్వసనీయతే తుది ఫలితాన్ని నిర్ణయిస్తాయి. తెలంగాణలో రాబోయే అసలు పోటీ పాత రాజకీయ శైలి, కొత్త డిజిటల్ జెన్‌జీ రాజకీయాల మధ్యనే ఉండబోతోంది.

# ఈ తరం.. ఎవరి తీరం?

# జెన్-జీ ఎటువైపు?

వారసత్వం కాదు... జవసత్వమే బలం..




## ముక్కుసూటి.. రాజముద్ర



**తెలంగాణ రాజకీయాల్లో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ప్రత్యేక గుర్తింపు తెచ్చింది ఆయన ముక్కుసూటితనం. పార్టీ ఏదైనా, పదవి ఏదైనా తన అభిప్రాయాన్ని నేరుగా చెప్పే నాయకుడిగా గుర్తింపు పొందారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా ప్రజా జీవితంలో సాగిన ఆయన ప్రయాణం రాజకీయాలకు మాత్రమే పరిమితం కాలేదు. ప్రజల్లో తిరగడం, సమస్యలపై స్పందించడం, అధికారాన్ని ప్రశ్నించడం ఆయన రాజకీయ శైలిగా మారింది. అదే ఇప్పుడు జెన్‌జీ ఎక్కువగా గమనిస్తున్న లక్షణంగా రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఎన్నికల సమయంలో రాజగోపాల్ రెడ్డిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానించినప్పుడు పెద్దలు చేసిన హామీల గురించి రాజకీయ వర్గాల్లో ఇప్పటికీ చర్చ జరుగుతోంది. పార్టీ అధికారంలోకి వస్తే ఆయనకు తగిన గౌరవం ఇస్తామని చెప్పిన నాయకత్వం ఇప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తిగా మారింది. ఇది కేవలం ఒక నాయకుడి పదవి అంశం కాదు. పార్టీ తనతో పాటు నడిచిన నాయకులను ఎలా గౌరవిస్తుందన్న సందేశం కూడా ఇందులో దాగి ఉంది.**

### మునుగోడు... మార్పుకు నాంది

బీఆర్ఎస్ హయాంలో రాజగోపాల్ రెడ్డి రాజీనామాతో మునుగోడు ఉప ఎన్నిక వచ్చింది. హోరాహోరీ జరిగిన ఆ ఎన్నికలో అప్పటి అధికార బీఆర్ఎస్ సామ దాన బేద దండోపాయాలన్నీ ప్రయోగించింది. అయినా కాస్త మెజారిటీతోనే గులాబీ పార్టీ గెలిచింది. రాజగోపాల్ రెడ్డి ఓడినా ఆయన బలం ఏ స్థాయిలో ఉందో రాష్ట్రమంతా చూసింది. ఆ ఉప ఎన్నిక కేసీఆర్ ప్రభుత్వంపై వ్యతిరేకతను రాష్ట్రవ్యాప్తంగా చర్చకు తీసుకువచ్చింది. మునుగోడులో పడిన రాజకీయ అలలు తర్వాత తెలంగాణ మొత్తం మీద కనిపించాయి. మునుగోడు తర్వాత తెలంగాణలో బీజేపీ బలపడుతుందని చాలా మంది అంచనా వేశారు. కానీ ఆ అవకాశాన్ని పార్టీ పూర్తిగా ఉపయోగించుకోలేకపోయింది. అదే సమయంలో కాంగ్రెస్ ఆ వ్యతిరేకతను తనవైపు మళ్లించడంలో విజయవంతమైంది. చివరకు ప్రజల్లో ఏర్పడిన మార్పు కోరిక కాంగ్రెస్ విజయానికి దారి తీసింది. ఈ మొత్తం ప్రక్రియలో రాజగోపాల్ రెడ్డి సృష్టించిన రాజకీయ మొమెంటమ్‌ను విస్మరించడం కష్టం.

### ఉన్నదున్నట్లు మాట్లాడే తత్వం

చరిత్రకు ప్రత్యామ్నాయం ఉండదు. కానీ రాజకీయ పరిణామాల్లో కొంతమంది నాయకులు మార్పుకు నాంది పలుకుతారనే వాస్తవాన్ని ఈ సంఘటన గుర్తు చేసింది. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉంది. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పనిచేస్తోంది. కానీ ప్రజల్లో ఉద్యమ నాయకుడి ఇమేజ్, ముక్కుసూటి నాయకత్వం, జెన్‌జీతో కనెక్ట్ అయ్యే శైలి ఉన్న నాయకుల అవసరం ఇంకా ఉందనే అభిప్రాయం వినిపిస్తోంది. అలాంటి నాయకుల జాబితాలో రాజగోపాల్ రెడ్డి పేరు ముందువరుసలో ఉండటం యాదృచ్ఛికం కాదు.

### జెన్-జీకి దగ్గరైన రాజకీయ శైలి

ప్రస్తుతం యువత పెద్ద పెద్ద రాజకీయ ప్రసంగాల కంటే సూటిగా మాట్లాడే నాయకులను ఎక్కువగా గమనిస్తోంది. ప్రశ్నిస్తే సమాధానం చెప్పే నాయకుడు, తప్పు కనిపిస్తే బహిరంగంగా చెప్పే నాయకుడు, ప్రజల్లోకి వెళ్లే నాయకుడు వారికి దగ్గరవుతున్నాడు. ఈ కోణంలో చూస్తే రాజగోపాల్ రెడ్డి రాజకీయ శైలి జెన్‌జీ ఆలోచనా విధానానికి దగ్గరగా ఉందనే అభిప్రాయం వినిపిస్తోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో రాజగోపాల్ రెడ్డి పేరు వినిపించినప్పుడు రాజకీయాల కంటే ముందు సేవా కార్యక్రమాలే చాలామంది గుర్తు చేస్తారు. విద్య, వైద్యం, పేద కుటుంబాలకు సహాయం, స్థానిక అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాత్ర గురించి అనేక సందర్భాల్లో ప్రస్తావనలు వచ్చాయి. ప్రజల్లో నిరంతరం కనిపించే నాయకుడిగా ఆయనకు ఏర్పడిన గుర్తింపు రాజకీయ బలంగా మారిందని స్థానిక పరిశీలకులు చెబుతున్నారు. రాజగోపాల్ రెడ్డి గురించి మద్దతుదారులు తరచుగా చెప్పే అంశం ఒకటే. వ్యాపారంలో సంపాదించిన సంపదలో పెద్ద భాగాన్ని ప్రజల కోసం వినియోగించారని వారు చెబుతుంటారు. ఆ వాదనను పక్కన పెట్టినా ప్రజా సేవను రాజకీయ ప్రచారంగా మార్చకుండా పనిచేసే నాయకుడిగా ఆయనకు ఒక ఇమేజ్ ఏర్పడింది. అదే ఆయనకు ఇతర నాయకుల కంటే భిన్నమైన గుర్తింపును తీసుకొచ్చింది.

### మంత్రి అయితే మారేది ఏమిటి?

రాజకీయాల్లో పదవి ఒక్కటే విజయానికి కొలమానం కాదు. కానీ సరైన బాధ్యత సరైన నాయకుడికి దక్కితే పరిపాలనపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ప్రజల్లో తిరిగిన అనుభవం ఉన్న నాయకుడికి పరిపాలనా బాధ్యత ఇస్తే ప్రభుత్వానికి కూడా ఉపయోగపడుతుందనే అభిప్రాయం కాంగ్రెస్‌లోని కొంతమంది నాయకుల్లో వినిపిస్తోంది. ఇదే అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

### రాజగోపాల్ రెడ్డిని కాంగ్రెస్ నిలబెట్టుకుంటుందా?

కాంగ్రెస్ ముందు ఇప్పుడు ఒక రాజకీయ నిర్ణయం ఉంది. ఉద్యమ దశలో పార్టీ కోసం రిస్క్ తీసుకున్న నాయకులను ఎలా గౌరవిస్తుంది? వారి అనుభవాన్ని ఎలా వినియోగిస్తుంది? పార్టీకి మొమెంటమ్ తీసుకొచ్చిన నాయకులకు సరైన ప్రాధాన్యం ఇస్తుందా? ఇవి కేవలం అంతర్గత అంశాలు కాదు. కార్యకర్తలకు, ప్రజలకు వెళ్లే రాజకీయ సందేశాలు కూడా. ఈ విషయంలో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో ప్రభావం చూపే అవకాశముంది.

# నెక్స్ట్.. కాపు బాపు

## టీడీపీలో బొండా బాంబు – కాకరేపుతున్న కాపు రాజకీయం



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సామాజిక వర్గాల ప్రభావం గురించి మాట్లాడితే కాపు సామాజికవర్గం పేరు తప్పకుండా వినిపిస్తుంది. రాష్ట్ర రాజకీయ సమీకరణాలను మార్చగలిగే శక్తి ఈ వర్గానికి ఉందని గత నాలుగు దశాబ్దాల రాజకీయ చరిత్ర చెబుతోంది. అయితే ఈ వర్గానికి చెందిన నాయకత్వం మాత్రం కాలానుగుణంగా మారుతూ వచ్చింది. ఒకప్పుడు వంగవీటి మోహనరంగా ఆవేశానికి, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిస్తే... తరువాత ముద్రగడ పద్మనాభం కాపు ఉద్యమానికి ప్రధానమైన ఐకాన్‌గా మారారు. అయితే ముద్రగడ మరణానంతరం "ఆ ఖాళీని ఎవరు భర్తీ చేస్తారు?" అనే ప్రశ్న కాపు సమాజంలో ఇపుడు బలంగా వినిపిస్తోంది. ఇదే సమయంలో గుంటూరులో జరిగిన ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభ రాజకీయంగా అనూహ్యమైన చర్చకు దారితీసింది. ఎన్నో రకాల మలుపులకు వేదికగా మారింది. మారబోతుంది కూడా. అధికార టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబుతో ఒకే వేదికపై కనిపించడం సాధారణ రాజకీయ మర్యాదగా చూడాలా, లేక భవిష్యత్ రాజకీయ సంకేతంగా అర్థం చేసుకోవాలా అనే తీవ్రమైన చర్చ మొదలైంది. వేదికపై ఇద్దరూ పరస్పరం ఆప్యాయంగా మెలగడం మీడియా, సోషల్ మీడియాలో విస్తృత చర్చకు కారణమైంది. ఈ పరిణామాల తర్వాత టీడీపీ అధిష్ఠానం స్పందించిన తీరు కూడా రాజకీయ ఆసక్తిని మరింత పెంచింది.

### కాపు కోణంలో బొండా కామెంట్లు కలకలం

బొండా ఉమ నుంచి వివరణ కోరాలని పార్టీ నాయకత్వం సూచించడం... దీనిపై అంతర్గత చర్చలు జరగడం కాపు సామాజికవర్గంలో భిన్న స్పందనలకు దారితీసింది. "ఒక సంస్మరణ సభలో ఒకే సామాజిక వర్గానికి చెందిన నాయకులు కలుసుకోవడంలో తప్పేంటి?" అనే ప్రశ్నను పలువురు కాపు నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియాలో లేవనెత్తుతున్నారు. వారు గుర్తు చేస్తున్న ఉదాహరణలు కూడా ఆసక్తికరంగానే ఉన్నాయి. నందమూరి తారకరత్న మరణ సమయంలో ప్రత్యర్థి పార్టీల నేతలు పరస్పరం పరామర్శించుకోవడం, ఇటీవలి కాలంలో వేర్వేరు పార్టీల నాయకులు సామాజిక.. వ్యక్తిగత సందర్భాల్లో ఒకరినొకరు పలకరించుకోవడం రాజకీయాల్లో అసాధారణం కాదని కూడా చెబుతున్నారు. అలాంటప్పుడు ముద్రగడ వంటి కాపు ఉద్యమ నేత సంస్మరణ సభలో బొండా, అంబటి కలిసి కనిపించడం ఎందుకు వివాదంగా మారిందని ప్రశ్నిస్తున్నారు. అయితే ఈ వ్యవహారంలో అసలు రాజకీయ ప్రకంపనలు సృష్టించిన అంశం బొండా ఉమ చేసిన వ్యాఖ్యలేనని పరిశీలకులు భావిస్తున్నారు. ముద్రగడ పద్మనాభం రాసిన లేఖలను అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడం కూడా 2019లో టీడీపీ ఓటమికి ఒక కారణమని ఆయన వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది. అధికార పార్టీలో ఉన్న ఒక ఎమ్మెల్యే గత రాజకీయ నిర్ణయాలపై ఇంత స్పష్టంగా మాట్లాడటం సాధారణ విషయం కాదు. అందుకే ఈ వ్యాఖ్యలు టీడీపీలో అంతర్గతంగా కూడా చర్చకు దారితీశాయి.

### కాపు రాజకీయాల్లో బొండా కేంద్రబిందువా?

ఇక్కడే మరో రాజకీయ కోణం కనిపిస్తోంది. బొండా ఉమ కేవలం ఒక వ్యక్తిగత అభిప్రాయాన్ని వ్యక్తం చేశారా? లేక కాపు సామాజికవర్గంలో పెరుగుతున్న భావోద్వేగాలను పార్టీ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారా? అనే ప్రశ్నలకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానం లేదు. కానీ ఈ వ్యాఖ్యల తర్వాత కాపు సామాజికవర్గంలో ఆయనపై చర్చ పెరిగిన విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. టీడీపీ రాజకీయాల్లో కాపు సామాజికవర్గం పాత్ర ఎప్పుడూ కీలకమే. పార్టీ ఆవిర్భావం నుంచి ఈ వర్గానికి చెందిన అనేక మంది నాయకులు ఎదిగారు. అయితే కాలక్రమేణా "పార్టీలో తమకు తగిన ప్రాధాన్యం తగ్గిందనే" భావన అప్పుడప్పుడు బయటపడుతూ వచ్చింది. అలాంటి సమయంలో ముద్రగడ మరణం, బొండా వ్యవహారం, అనంతర పరిణామాలు ఈ చర్చను మళ్లీ ముందుకు తెచ్చాయి. మరోవైపు కూటమి రాజకీయాల్లో పవన్ కళ్యాణ్ ఇప్పటికే కాపు సమాజానికి అత్యంత ప్రభావవంతమైన నాయకుడిగా ఉన్నారు. జనసేన అధినేతగా మాత్రమే కాకుండా అధికార కూటమిలో కీలక భాగస్వామిగా కూడా ఆయన పాత్ర ఉంది. అలాంటి పరిస్థితిలో కాపు రాజకీయాల్లో మరో శక్తివంతమైన స్వరం అవసరమా? లేక ఇప్పటికే ఉన్న నాయకత్వమే సరిపోతుందా? అనే చర్చ కూడా జరుగుతోంది.

### కాపు నాయకత్వంపై మళ్లీ మొదలైన చర్చ

ఇదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాపు సామాజికవర్గంతో సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తున్నారనే రాజకీయ విశ్లేషణలు కూడా వినిపిస్తున్నాయి. సినీ రంగానికి చెందిన ప్రముఖులతో సమావేశాలు, కూటమి సమీకరణాల్లో సమతుల్యత పాటించే ప్రయత్నాలు, సామాజిక సమీకరణాలపై ప్రత్యేక దృష్టి ఇవన్నీ ఆ దిశలోనే చూస్తున్నవారు ఉన్నారనే. విశ్లేషణలు కూడా విహరిస్తున్నాయి. ప్రస్తుతం వైసీపీ కూడా ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అధికార పార్టీలో ఏ చిన్న అసంతృప్తి కనిపించినా దాన్ని రాజకీయ అవకాశంగా మార్చుకోవాలనే ప్రయత్నం ప్రతి ప్రతిపక్షం చేస్తుంది. బొండా వ్యవహారం కూడా అలాంటి అవకాశంగా మారుతుందా అనేది రానున్న రోజుల్లో తేలాల్సి ఉంది. కాపు సామాజికవర్గంలో మరో భావోద్వేగ అంశం కూడా కనిపిస్తోంది. వంగవీటి మోహనరంగా తర్వాత ముద్రగడ పద్మనాభం వరకు ఒక ఉద్యమ నాయకత్వం కనిపించిందని, ఇప్పుడు అలాంటి ధైర్యంగా మాట్లాడే, అవసరమైతే అధికారాన్నే ప్రశ్నించే నాయకుడు ఎవరు అనే చర్చ అదే సామాజిక వర్గంలో సాగుతోందని కొందరు రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

### రాజకీయ అజెండాగా కాపు ఆత్మగౌరవం అంశం

అయితే ఈ అభిప్రాయం మొత్తం కాపు సమాజం అభిప్రాయమేనని చెప్పడం సరైంది కాదనిపిస్తోంది. ఇది ఆ వర్గంలోని కొంతమంది వ్యక్తం చేస్తున్న రాజకీయ భావనగా చూడాల్సిందేనని పరిశీలకులు చెప్పుకుంటున్న మాట. మొత్తంగా చూస్తే, ముద్రగడ సంస్మరణ సభ ఒక నివాళి కార్యక్రమం మాత్రమే కాకుండా కాపు రాజకీయాల భవిష్యత్తుపై కొత్త చర్చకు తెరతీసిన వేదికగా మారింది. బొండా ఉమ వ్యవహారం టీడీపీకి సంబంధించిన క్రమశిక్షణ అంశమా? లేక పెద్ద రాజకీయ సంకేతమా? అనేది ఇప్పుడే తేల్చలేం. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కాపు నాయకత్వం, కాపు ఆత్మగౌరవం, కాపు ఓటు బ్యాంక్ అనే అంశాలు మళ్లీ రాజకీయ చర్చల కేంద్రబిందువుగా మారుతున్నాయి. ఈ చర్చ ఎటువైపు మలుపు తిరుగుతుందో... ఆ సమాధానమే రాబోయే రాష్ట్ర రాజకీయాల దిశను కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది.

## కమిటీ ముందు హాజరవుతా

- పార్టీకి నష్టం చేసే వ్యాఖ్యలు చేయలేదు
- స్పష్టం చేసిన ఎమ్మెల్యే బొండా ఉమ

వైఎస్సార్‌సీపీ నేత అంబటి రాంబాబుతో ఒకే వేదికను పంచుకోవడం, ఆ సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావును పార్టీ అధిష్ఠానం వివరణ కోరిన నేపథ్యంలో ఆయన స్పందించారు. తాను పార్టీకి ఇబ్బంది కలిగించేలా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని స్పష్టం చేశారు. తన గురించి పార్టీ అధినేత చంద్రబాబు నాయుడికి పూర్తిగా తెలుసని, పార్టీ విలువలు తనకు బాగా తెలుసని అన్నారు. పార్టీ ఏర్పాటు చేసిన కమిటీ ఎదుట హాజరై అన్ని అంశాలపై వివరణ ఇస్తానని తెలిపారు. గుంటూరులో జరిగిన ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభలో బొండా ఉమా, అంబటి రాంబాబు ఒకే వేదికపై కనిపించడం రాజకీయ చర్చకు దారితీసింది. సభలో బొండా ఉమా చేసిన వ్యాఖ్యలు కూడా పార్టీలో చర్చనీయాంశంగా మారాయి. ఈ పరిణామాలను తీవ్రంగా పరిగణించిన టీడీపీ అధిష్ఠానం ఎమ్మెల్యే నుంచి వివరణ తీసుకోవాలని నిర్ణయించింది. బొండా ఉమ నుంచి పూర్తి వివరణ తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడుకు చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

## 'అప్పుడు ఒప్పు.. ఇప్పుడు తప్పా?'


- బొండా వివాదంపై అంబటి కౌంటర్



గతంలో చంద్రబాబు నాయుడు, విజయసాయిరెడ్డి కలిసి మాట్లాడుతున్న ఫోటోను షేర్ చేసారు అంబటి రాంబాబు. దాని పక్కనే తాను, బొండా ఉమా మాట్లాడుతున్న ఫోటోను ఉంచి, "నాటి మీ కలయికలో లేని తప్పు.. నేటి మా కలయికలో తప్పు ఎలా అయ్యింది?" అంటూ ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. సంతాప సభలకు రాజకీయ రంగు పులమడం సరికాదని అంబటి రాంబాబు అభిప్రాయపడ్డారు. రాజకీయ విభేదాలు ఒకటైతే, మరణించిన వారికి నివాళి అర్పించడం మరో అంశమని చెప్పారు. అలాంటి కార్యక్రమాలకు నేతలు వెళ్లొద్దని చెప్పడం సరికాదని విమర్శించారు. రాజకీయాలు, సంతాప కార్యక్రమాల మధ్య తేడాను గుర్తించాలని సూచించారు.

# డీప్‌ఫేక్ పోస్టులపై గడ్కరీ పోరు

- మెటా, గూగుల్, ఎక్స్‌కు లీగల్ షాక్



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి బాంబే హైకోర్టు కీలక ఊరట ఇచ్చింది. ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్ (ఈ20)తో తనను తప్పుడు రీతిలో అనుసంధానిస్తూ సోషల్ మీడియాలో ప్రచారమైన డీప్‌ఫేక్ పోస్టులపై మెటా, గూగుల్, ఎక్స్‌తో పాటు ఇతర గుర్తు తెలియని వ్యక్తులపై సివిల్ దావా వేయడానికి అనుమతి ఇచ్చింది. జస్టిస్ అభయ్ అహూజా ఈ మేరకు అనుమతి మంజూరు చేశారు. తప్పుడు పోస్టులను ఇంటర్నెట్ నుంచి తొలగించాలని కూడా గడ్కరీ కోర్టును కోరనున్నారు.

**ఈ20 విధానంతో తనకు సంబంధం లేదన్న గడ్కరీ**

2003లో కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించిందని గడ్కరీ కోర్టుకు వివరించారు. 202526 నాటికి ఈ20 అమలు పూర్తయిందని తెలిపారు. ఈ విధానానికి సంబంధించిన నిర్ణయాలు పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ పరిధిలోనే ఉంటాయని స్పష్టం చేశారు. తాను 2014 నుంచి రోడ్డు రవాణా శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ఈ20 విధాన నిర్ణయాల్లో తన పాత్ర లేదని పేర్కొన్నారు.

**తప్పుడు ఆరోపణలపై అభ్యంతరం**


సోషల్ మీడియాలో వైరల్ అయిన పలు పోస్టుల్లో ఈ20 అమలుతో తనకు, తన కుటుంబ సభ్యులకు అక్రమ ఆర్థిక లాభాలు వచ్చాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని గడ్కరీ ఆరోపించారు. అవినీతి, బంధుప్రీతి, అధికార దుర్వినియోగం వంటి ఆరోపణలు పూర్తిగా అసత్యమని చెప్పారు. కనీస ఆధారాలు లేకుండా తన ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం జరిగిందని కోర్టుకు వివరించారు.

**రూ.11 కోట్ల పరిహారం డిమాండ్**

తన పరువుకు భంగం కలిగించే కనీసం 24 పోస్టులను గుర్తించినట్లు గడ్కరీ తెలిపారు. వాటిని వెంటనే తొలగించాలని కోరుతూ రూ.11 కోట్ల నష్టపరిహారం కూడా డిమాండ్ చేశారు. ప్రజా చర్చను అడ్డుకోవడం తన ఉద్దేశం కాదని, అసత్య ప్రచారాన్ని మాత్రమే సవాల్ చేస్తున్నానని స్పష్టం చేశారు. ఈ కేసు తదుపరి విచారణ జస్టిస్ ఆరిఫ్ డాక్టర్ ధర్మాసనం ముందు జరిగే అవకాశం ఉంది.

# రాజీనామాపై కుమార్తె పోస్ట్

- బీజేపీలో అసంతృప్తి వెల్లువ
- ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ దుమారం



ఒడిశాలో బీజేపీలో కొత్త వివాదం చెలరేగింది. భువనేశ్వర్ ఎంపీ అపరాజిత సారంగి కుమార్తె అర్చితా సచిన్ రహార్ చేసిన ఇన్‌స్టాగ్రామ్ పోస్టు పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన నేపథ్యంలో, "నీట్ పేపర్ లీక్ ఘటనపై విద్యార్థుల భారీ నిరసనల మధ్య ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు" అంటూ ఆయన ఫొటోతో కూడిన పోస్టును ఆమె సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ పోస్టు వైరల్ కావడంతో బీజేపీ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అపరాజిత సారంగి రెండుసార్లు భువనేశ్వర్ ఎంపీగా ఎన్నికైనా, ఈ అంశంపై ఆమె స్పందించలేదు. ధర్మేంద్ర ప్రధాన్ కార్యాలయం నుంచి ఫోన్ రావడంతో పోస్టును తొలగించాలని ఆమె కుమార్తెకు సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అయితే అప్పటికే వివాదం ముదిరింది. బీజేపీ నేత జగన్నాథ్ ప్రధాన్ స్పందిస్తూ, ధర్మేంద్ర ప్రధాన్ ఒడిశా గర్వకారణమని, ఆయన రాజీనామా రాష్ట్ర ప్రజలను బాధించిందని అన్నారు. బిహార్‌కు చెందిన అపరాజిత సారంగిని ఒడిశా ప్రజలు రెండుసార్లు ఎంపీగా గెలిపించారని గుర్తు చేస్తూ, ఆమె కుటుంబ సభ్యుల వ్యాఖ్యలపై నియంత్రణ ఉండాలని, కుమార్తె చేసిన వ్యాఖ్యలకు రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో ఈ వ్యవహారం ఒడిశా బీజేపీలో రాజకీయ చర్చగా మారింది.

# సాయికృష్ణ కేసులో నాగరాజు కస్టడీకి గ్రీన్ సిగ్నల్



సాయికృష్ణ కస్టడీ మరణం, అదృశ్యం కేసులో నిందితుడైన సస్పెండెడ్ మాజీ సీఐ ఎస్ఎస్‌వీవీ నాగరాజు పోలీసు కస్టడీ విచారణపై హైకోర్టు విధించిన పలు ఆంక్షలను సుప్రీంకోర్టు సడలించింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను విచారించిన జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం, రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలోనే విచారణ జరపాలన్న షరతు ఆచరణ సాధ్యం కాదని పేర్కొంది. కేసు దర్యాప్తు సమర్థంగా సాగాలంటే నిందితుడిని అవసరమైన ప్రాంతాలకు తీసుకెళ్లే స్వేచ్ఛ దర్యాప్తు బృందానికి ఉండాలని స్పష్టం చేసింది. సాయికృష్ణ మృతదేహం ఇప్పటికీ లభించలేదని, సీసీటీవీ హార్డ్‌డిస్కులు స్వాధీనం కాలేదని, విచారణలో కీలక ఆధారాలు బయటపడే అవకాశం ఉందని సిట్ వాదనను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది. విజయవాడలోని సిట్ విచారణ కేంద్రం లేదా భద్రత కలిగిన మరో ప్రదేశంలో నిందితుడిని ప్రశ్నించేందుకు అనుమతి ఇచ్చింది. విచారణ, స్వాధీన ప్రక్రియను వీడియోలో రికార్డు చేయాలని ఆదేశించిన కోర్టు, ప్రయాణాన్ని నిరంతరం చిత్రీకరించాల్సిన అవసరం లేదని తెలిపింది. నిందితుడికి ఏడు రోజుల పోలీసు కస్టడీ మంజూరు చేసిన ధర్మాసనం, విచారణ శాస్త్రీయంగా, నిష్పాక్షికంగా జరగాలని, ఎలాంటి బలవంతపు పద్ధతులు, థర్డ్ డిగ్రీ ప్రయోగించరాదని సిట్‌ను ఆదేశించింది.



# లిక్కర్ స్కామ్ కేసులో మాజీ ఐఏఎస్‌లకు బెయిల్

లిక్కర్ స్కామ్ కేసులో మాజీ ఐఏఎస్ అధికారులు కె. ధనుంజయరెడ్డి, పి. కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. కొన్ని షరతులతో బెయిల్ మంజూరు చేసిన న్యాయస్థానం ధనుంజయరెడ్డి, బాలాజీ గోవిందప్ప ప్రతి ఆదివారం దర్యాప్తు అధికారుల ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. కృష్ణమోహన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఆయనకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చింది. ఆరోపణలు జరిగిన కాలంలో ధనుంజయరెడ్డి ముఖ్యమంత్రి కార్యాలయంలో కార్యదర్శిగా, కృష్ణమోహన్ రెడ్డి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఓఎస్డీగా పనిచేశారు. బాలాజీ గోవిందప్ప జగన్ కుటుంబ సభ్యులకు చెందినట్లు పేర్కొన్న సంస్థలో డైరెక్టర్‌గా ఉన్నారు.
ఈ కేసులో ముగ్గురికీ గతంలో ట్రయల్ కోర్టు డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేయగా, సిట్ అభ్యంతరాలతో హైకోర్టు ఆ ఉత్తర్వులను రద్దు చేసింది. అనంతరం సుప్రీంకోర్టును ఆశ్రయించిన నిందితులకు లొంగిపోవాల్సిన అవసరం లేకుండా తాత్కాలిక రక్షణ కల్పించిన సుప్రీంకోర్టు, రెగ్యులర్ బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించాలని సూచించింది. ఆ మేరకు దాఖలైన పిటిషన్లను విచారించిన హైకోర్టు, సిట్ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత కూడా షరతులతో కూడిన రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది.



# ఉడాన్‌తో నయా విప్లవం

- విమానయానానికి భారీ ఊతం
- సామాన్యుడికి మరింత చేరువ
- రూ.28,840 కోట్లతో కొత్త ప్రణాళిక

ఒకప్పుడు విమాన ప్రయాణం అంటే ధనికులకే పరిమితమనే అభిప్రాయం ఉండేది. కానీ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉడాన్ పథకం ఆ పరిస్థితిని పూర్తిగా మార్చింది. ఇప్పుడు ఈ విజయాన్ని మరింత విస్తరించేందుకు రూ.28,840 కోట్ల వ్యయంతో 'నవీకరించిన ఉడాన్' పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 2026 27 నుంచి 203536 వరకు అమలయ్యే ఈ పథకం ద్వారా దేశంలోని చిన్న పట్టణాలు, మారుమూల ప్రాంతాలకు విమాన సౌకర్యాలను మరింత విస్తరించనున్నారు.

### 100 విమానాశ్రయాలు.. 200 హెలిప్యాడ్‌లు

ఈ పథకంలో భాగంగా రూ.12,159 కోట్లతో కొత్తగా 100 విమానాశ్రయాలను అభివృద్ధి చేయనున్నారు. కొండ ప్రాంతాలు, దూర ప్రాంతాల్లో అత్యవసర సేవలను వేగవంతం చేసేందుకు రూ.3,661 కోట్లతో 200 ఆధునిక హెలిప్యాడ్‌లను నిర్మించనున్నారు. ఇప్పటికే ఉడాన్ కింద 95 విమానాశ్రయాలు, హెలిపోర్టులు, వాటర్ ఏరోడ్రోమ్‌లు అభివృద్ధి కాగా, 679 మార్గాల్లో 1.68 కోట్ల మందికి తక్కువ ఖర్చుతో విమాన ప్రయాణం అందుబాటులోకి వచ్చింది.

### ప్రయాణికులకు.. విమాన సంస్థలకు లాభం

చిన్న పట్టణాల మార్గాల్లో విమాన సర్వీసులు కొనసాగించేందుకు ప్రభుత్వం వైబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద రూ.10,043 కోట్లు కేటాయించింది. నిర్వహణ వ్యయాల కోసం మరో రూ.2,577 కోట్ల మద్దతు ఇవ్వనుంది. స్వదేశీ హెచ్ఏఎల్ డోర్నియర్ విమానాలు, ధ్రువ్ హెలికాప్టర్ల వినియోగానికి ప్రాధాన్యం ఇస్తూ 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి బలం చేకూర్చుతోంది. ఉడాన్ యాత్రి కేఫ్‌లు, ఉచిత వైఫై, ఫ్లైబ్రరీ వంటి సదుపాయాలతో విమాన ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారనుంది. ఈ పథకం ప్రాంతీయ అనుసంధానాన్ని బలోపేతం చేయడంతో పాటు పర్యాటకం, వ్యాపారం, ఉపాధి అవకాశాలకు కొత్త ఊపునివ్వనుంది.

## ప్రొద్దుటూరుకు కార్పొరేషన్

# హోదా తప్పనిసరి!

**మినీ ముంబై లక్ష్యమన్న టీడీపీ నేత బసిరెడ్డి**

మినీ ముంబైగా గుర్తింపు పొందిన ప్రొద్దుటూరు ఇప్పటికే కడప జిల్లా వాణిజ్య కేంద్రంగా ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. బంగారు వ్యాపారం, వస్త్ర మార్కెట్, విద్యాసంస్థలు, వైద్య సేవలు, వేలాది మంది ప్రజల రాకపోకలతో ప్రతిరోజూ సందడిగా కనిపించే ఈ పట్టణం ఇప్పుడు మరో కీలక దశలో నిలిచింది. ప్రొద్దుటూరును భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలంటే కార్పొరేషన్ హోదా తప్పనిసరిగా రావాలని టీడీపీ నేత బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి అభిప్రాయపడుతున్నారు. వేగంగా విస్తరిస్తున్న పట్టణానికి అదే సరైన దిశ అని ఆయన చెబుతున్నారు.

**విలీనమే అభివృద్ధికి బాట**

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిని విస్తరించాల్సిన అవసరం ఉందని బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి వివరించారు. ఆనుకుని ఉన్న కొత్తపల్లెతో పాటు సమీప గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేస్తే జనాభా ప్రమాణాలు పెరిగి కార్పొరేషన్ హోదా సాధించే అవకాశం ఉంటుందని చెప్పారు. పట్టణ విస్తరణను దృష్టిలో పెట్టుకుని ఇప్పుడే నిర్ణయం తీసుకుంటే భవిష్యత్ అభివృద్ధికి బలమైన పునాది పడుతుందని ఆయన పేర్కొన్నారు. కార్పొరేషన్ హోదా అనేది కేవలం పేరు మార్పు కాదని బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. రహదారుల విస్తరణ, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ, నిరంతర తాగునీటి సరఫరా, ఎల్ఈడీ వీధి దీపాలు, పార్కుల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ వంటి మౌలిక వసతులకు మరింత ప్రణాళికాబద్ధంగా నిధులు సమకూరే అవకాశం ఉంటుందని వివరించారు. దీని వల్ల ప్రొద్దుటూరు రూపురేఖలు పూర్తిగా మారిపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.



**ప్రజల మద్దతే బలమని పిలుపు**

ప్రస్తుతం ప్రొద్దుటూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో పట్టణీకరణ వేగంగా జరుగుతోందని టీడీపీ నేతలు చెబుతున్నారు. జనాభా పెరుగుతున్నా చాలా ప్రాంతాలు ఇంకా పంచాయతీ పరిధిలోనే కొనసాగుతున్నాయని గుర్తు చేస్తున్నారు. దీంతో రహదారులు, మురుగునీటి వ్యవస్థ, తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్యం వంటి అంశాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. ఈ ప్రాంతాలను మున్సిపాలిటీలో విలీనం చేస్తే సమగ్ర అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందని బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి వివరించారు.
విలీన ప్రక్రియకు స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి తెలిపారు. కొత్తపల్లె పంచాయతీ కార్యాలయంలో నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణలో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ అభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల సహకారంతోనే ప్రొద్దుటూరుకు కార్పొరేషన్ హోదా సాధ్యమవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

**ప్రొద్దుటూరు భవిష్యత్తుకు కీలక అడుగు**



ప్రొద్దుటూరు ఇప్పటికే జిల్లాలో ప్రముఖ మున్సిపాలిటీలలో ఒకటిగా ఎదిగింది. ఇప్పుడు కార్పొరేషన్ హోదా దిశగా అడుగులు పడితే అభివృద్ధి మరింత వేగం అందుకుంటుందని బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి చెబుతున్నారు. అందమైన నగరం, ఆధునిక మౌలిక వసతులు, మెరుగైన జీవన ప్రమాణాలు, సమగ్ర నగరాభివృద్ధి లక్ష్యంగా ఈ ప్రతిపాదన ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఈ నిర్ణయం ప్రొద్దుటూరు భవిష్యత్తును నిర్ణయించే కీలక మలుపుగా నిలుస్తుందని రాజకీయ వర్గాలతో పాటు ప్రజల్లో కూడా ఆశాభావం వ్యక్తమవుతోంది.



## బాక్సింగ్‌లో అంకుష్ జోరు

### క్వార్టర్ ఫైనల్‌లోకి భారత స్టార్

కామన్వెల్త్ గేమ్స్2026లో భారత యువ బాక్సర్ అంకుష్ పంఘాల్ శుభారంభం చేశాడు. పురుషుల 80 కేజీల విభాగంలో అరంగేట్ర పోరులో అంకుష్ అద్భుత ఆటతీరుతో ఆంటిగ్వా అండ్ బార్బుడాకు చెందిన జలాన్ జాన్‌పై 50 తేడాతో ఏకగ్రీవ విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. 22 ఏళ్ల అంకుష్ తొలి రౌండ్ నుంచే దూకుడుగా ఆడి కచ్చితమైన పంచ్‌లతో ప్రత్యర్థిపై ఆధిపత్యం చెలాయించాడు. సమర్థవంతమైన డిఫెన్స్‌తో పాటు వేగవంతమైన కౌంటర్ అటాక్‌లతో న్యాయనిర్ణేతలందరి మద్దతు పొందాడు. రెండో రౌండ్‌లో కూడా అదే జోరును కొనసాగిస్తూ ప్రత్యర్థికి అవకాశమే ఇవ్వకుండా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు.
చివరి రౌండ్‌లోనూ అంకుష్ ఏమాత్రం ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పోరాడాడు. కోచ్‌ల సూచనలను పాటిస్తూ అవసరం లేని దాడులకు దూరంగా ఉంటూనే శక్తివంతమైన కాంబినేషన్ పంచ్‌లతో ఆకట్టుకున్నాడు. జలాన్ జాన్ కొంతసేపు అంకుష్‌ను రోప్‌ల వద్ద నిలువరించినా భారత బాక్సర్ ఆటపై ప్రభావం చూపలేకపోయాడు. పూర్తి సమయంపై నియంత్రణ సాధించిన అంకుష్ ఏకపక్ష విజయాన్ని నమోదు చేసి పతక ఆశలను మరింత బలపరిచాడు. కామన్వెల్త్ గేమ్స్‌లో తొలి మ్యాచ్‌లోనే చూపిన ఆత్మవిశ్వాసం, వ్యూహాత్మక నైపుణ్యం భారత శిబిరంలో ఉత్సాహాన్ని నింపింది. ఇప్పుడు క్వార్టర్ ఫైనల్‌లో కూడా ఇదే జోరును కొనసాగించి భారత్‌కు పతకం అందించాలనే లక్ష్యంతో బరిలోకి దిగనున్నాడు.

## మెరిసిన బింద్యారాణి

### భారత్‌కు మరో పతకం

భారత్‌కు కామన్వెల్త్ గేమ్స్2026లో మరో పతకం లభించింది. అనుభవజ్ఞురాలైన వెయిట్‌లిఫ్టర్ బింద్యారాణి దేవి మహిళల 58 కేజీల విభాగంలో కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. గ్లాస్గో వేదికగా జరిగిన పోటీల్లో ఆమె మొత్తం 199 కేజీల బరువును ఎత్తి మూడో స్థానంలో నిలిచింది. స్నాచ్ విభాగంలో 87 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 112 కేజీలు ఎత్తి అద్భుత ప్రదర్శన కనబరిచింది. స్నాచ్‌లో తొలి ప్రయత్నంలో 83 కేజీలు, రెండో ప్రయత్నంలో 85 కేజీలు, చివరి ప్రయత్నంలో 87 కేజీలు విజయవంతంగా పూర్తి చేసి పతక పోరులో నిలిచింది. ఈ విభాగంలో నైజీరియాకు చెందిన రఫియాటు ఫొలాషాడే మొత్తం 229 కేజీలతో కామన్వెల్త్ గేమ్స్ రికార్డు నెలకొల్పుతూ స్వర్ణ పతకం గెలుచుకుంది. కెనడాకు చెందిన ఆన్ సోఫీ టషెరో 215 కేజీలతో రజత పతకం సాధించింది. 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో రజత పతకం గెలిచిన బింద్యారాణి, మరోసారి పతకం సాధించి తన స్థిరమైన ప్రదర్శనను కొనసాగించింది. అహ్మదాబాద్‌లో జరిగిన కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో కూడా రన్నరప్‌గా నిలిచిన ఆమె, ఈ విజయంతో భారత్‌కు వెయిట్‌లిఫ్టింగ్‌లో ఐదో పతకం, మొత్తం ఆరో పతకాన్ని అందించింది.





## జ్ఞానేశ్వరి యాదవ్ అద్భుత ప్రదర్శన

### రజతంతో వెయిట్‌లిఫ్టర్ సత్తా





కామన్వెల్త్ గేమ్స్2026లో అరంగేట్రం చేసిన భారత వెయిట్‌లిఫ్టర్ జ్ఞానేశ్వరి యాదవ్ అద్భుత ప్రదర్శనతో రజత పతకం గెలిచి దేశానికి మరో విజయాన్ని అందించింది. మహిళల 53 కేజీల విభాగంలో నైజీరియాకు చెందిన ఒనోమే ఒమోలోలా డిడిహ్‌తో హోరాహోరీగా పోటీ పడిన జ్ఞానేశ్వరి చివరకు రజత పతకాన్ని సొంతం చేసుకుంది. తన లక్ష్యం అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడమేనని, ఆ ప్రయత్నం ఫలించి రజతం దక్కడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపింది. మీరాబాయి చాను స్వర్ణ పతకం తనకు గొప్ప ప్రేరణగా నిలిచిందని, కోచ్‌ల సహకారం వల్లే ఈ విజయం సాధ్యమైందని వెల్లడించింది. ఈ విజయంతో భారత్ పతకాల సంఖ్య ఐదుకు చేరుకుంది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 23 ఏళ్ల జ్ఞానేశ్వరి పోటీ మొత్తం అసాధారణ ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించింది. స్నాచ్‌లో 88 కేజీలు ఎత్తి కామన్వెల్త్ గేమ్స్ రికార్డు నెలకొల్పింది. క్లీన్ అండ్ జెర్క్‌లో 111 కేజీలు విజయవంతంగా ఎత్తి మొత్తం 199 కేజీలతో మరో రికార్డు సృష్టించింది. అయితే డిడిహ్ చివరి ప్రయత్నంలో 113 కేజీలు ఎత్తి మొత్తం 206 కేజీలతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. గతంలో 49 కేజీల విభాగంలో పోటీ చేసిన జ్ఞానేశ్వరి, ఒలింపిక్ పతక విజేత మీరాబాయి చాను ఉన్న కారణంగా 53 కేజీల విభాగానికి మారింది. తొలి కామన్వెల్త్ గేమ్స్‌లోనే రజత పతకం గెలిచి భారత వెయిట్‌లిఫ్టింగ్‌కు మరో ఆశాకిరణంగా నిలిచింది.



## సెంచరీలే లక్ష్యం కాదు

### సూర్యవంశీ ఆటతీరే ప్రత్యేకం

భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఆటతీరుపై మాజీ ఓపెనర్ వసీం జాఫర్ ప్రశంసల వర్షం కురిపించారు. ప్రతి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేయాలనే ఒత్తిడితో కాకుండా జట్టు కోసం దూకుడుగా ఆడటమే సూర్యవంశీ ప్రత్యేకత అని అన్నారు. జింబాబ్వేతో జరిగిన మూడు టీ20ల సిరీస్‌లో రెండు అర్ధ సెంచరీలు సాధించిన 15 ఏళ్ల సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్‌లో తన సత్తా చాటాడని కొనియాడారు. తొలి మ్యాచ్‌లో 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసిన అతడు, చివరి మ్యాచ్‌లో 49 బంతుల్లో 81 పరుగులు చేసి భారత్‌కు సిరీస్ విజయాన్ని అందించాడు. వ్యక్తిగత మైలురాళ్ల కంటే జట్టు ప్రయోజనానికే ప్రాధాన్యం ఇవ్వడం అతని గొప్ప లక్షణమని జాఫర్ పేర్కొన్నారు. ఐపీఎల్ నాకౌట్ మ్యాచ్‌ల్లో కూడా 90లలో ఉన్నప్పుడు సెంచరీ కోసం సింగిల్స్ తీసుకునే ప్రయత్నం చేయకుండా సహజమైన దూకుడు ఆటనే కొనసాగించాడని జాఫర్ గుర్తు చేశారు. అదే అతడి విజయానికి ప్రధాన కారణమని చెప్పారు.

## సూర్యవంశీకి వన్డే ఛాన్స్

### రోహిత్‌తో ఓపెనర్‌గా దింపండి

భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని వెంటనే భారత వన్డే జట్టులోకి తీసుకోవాలని మాజీ క్రికెటర్ ఫరూఖ్ ఇంజినీర్ సూచించారు. రోహిత్ శర్మతో కలిసి సూర్యవంశీ ఓపెనింగ్ చేయాలని, శుభ్‌మన్ గిల్‌ను నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు పంపితే జట్టు మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. ఎడమచేతి -కుడిచేతి ఓపెనింగ్ జోడీ ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి పెంచుతుందని చెప్పారు. విరాట్ కోహ్లీ మూడో స్థానంలో, గిల్ నాలుగో స్థానంలో ఆడితే భారత బ్యాటింగ్ లైనప్ అత్యంత పటిష్ఠంగా మారుతుందని పేర్కొన్నారు. ఇటీవల జింబాబ్వేతో జరిగిన మూడు టీ20ల సిరీస్‌లో 151 పరుగులు, రెండు అర్ధసెంచరీలతో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన సూర్యవంశీ ప్రతిభను ఆయన ప్రశంసించారు. కేవలం 15 ఏళ్ల వయసులోనే సూర్యవంశీ అసాధారణ ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శిస్తున్నాడని ఫరూఖ్ ఇంజినీర్ అన్నారు.





## ఆదర్శకుటుంబంలో చిట్టిబాబు గ్లింప్స్ విడుదల



టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వస్తున్నచిత్రం 'ఆదర్శ కుటుంబం' వెంకీ 77వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను గాంధీ జయంతి సందర్భంగా, అక్టోబర్ 2వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారని తెలిసిందే. ప్రతి కుటుంబం గుర్తుపెట్టుకోవాల్సిన తేదీ.. అక్టోబర్ 2న ఆదర్శ కుటుంబం తలుపులు తెరుచుకోబోతున్నాయి.. అంటూ మేకర్స్ హైప్ పెంచేస్తున్నారు. తాజాగా ప్రమోషన్స్‌లో భాగంగా వెంకీ పోషిస్తున్న చిట్టిబాబు పాత్ర గ్లింప్స్‌ను షేర్ చేశారు. కిచెన్‌లో ఏసీనా.. నాన్న నువ్వు వంట చేసేటప్పుడు హ్యాపీగా ఏసీ వేసుకుని చేసుకోవచ్చు. అవును నేను మ్యాన్ ఆఫ్ ది హౌస్. వాషింగ్ మెషిన్ కూడా ఉంది.. నీకు పని బాగా తగ్గిపోయినట్టేనని శ్రీనిధి శెట్టి అంటున్న డైలాగ్స్‌తో షురూ అయింది గ్లింప్స్. చిట్టిగారు అని రఘుబాబు అంటుంటే అస్తమానం తలతిప్పకండి బుజ్జిగారు మెడ పట్టేస్తుంది.. నాకు ఎవరేం పని చేసినా నచ్చదు. అందుకే అన్నీ నేనే చూసుకుంటానంటున్నాడు వెంకీ.. ఆదర్శ కుటుంబం అంటూ నారా రోహిత్ డైలాగ్స్‌తో ఎండ్ అయింది గ్లింప్స్. మొత్తానికి చిట్టిబాబుగా వెంకీ అండ్ ఫ్యామిలీ పక్కా వినోదాన్నిఅందించబోతుందని తాజా గ్లింప్స్ చెప్పకనే చెబుతోంది. ఈ చిత్రంలో కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు), వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీకి స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సంగీతం అందిస్తున్నాడు. వెంకటేష్, త్రివిక్రమ్ కాంబోలో వస్తున్న మొదటి ఫుల్ లెంగ్త్ సినిమా కావడంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి.



## సెప్టెంబర్‌లో మహేంద్రగిరి వారహి

సుమంత్ హీరోగా సంతోష్ జాగర్లమూడి ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'మహేంద్రగిరి వారాహి' సోషియో ఫాంటసీ చిత్రాన్ని సెప్టెంబర్ 11న విడుదల చేయనున్నట్లు టీమ్ వెల్లడించింది. ఈ సినిమా కోసం రెండున్నరేళ్లు చర్చలు జరిగినట్లు సుమంత్ తెలిపారు. మధ్యలో ఈ సినిమా సందిగ్ధంలో పడిందని గుర్తుచేసుకున్నారు. ఇందులో ట్విస్ట్‌లు చాలా ఉన్నాయని తెలిపారు. ఓ స్టార్ హీరో దాదాపు 20 నిమిషాలు కనిపిస్తారని నిర్మాత మధు వెల్లడించారు. కథ నచ్చడంతో వెంటనే ఓకే చేశారు. వారాహి అమ్మవారిగా నటించారా లేదా.. మరేదైనా పాత్రలో కనిపిస్తారా అనేది స్క్రీన్‌పై చూసి తెలుసుకోవాలి. సంతోష్‌కు ఆధ్యాత్మికత, చరిత్ర గురించి చాలా విషయాలు తెలుసు. మొదట అనుకున్న కథలో కొన్ని మార్పులు చేసి దీన్ని రూపొందించాం. ఇందులో నటించడం చాలా ఆసక్తిగా అనిపిస్తోంది.





## రాకా షూటింగ్‌లోకి అల్లు అర్జున్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్,స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక పాన్`ఇండియా చిత్రం రాకా పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కొత్త షూటింగ్ షెడ్యూల్‌కు సంబంధించిన ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. తాజా సమాచారం ప్రకారం, చిత్రబృందం త్వరలో ప్రారంభం కానున్న కొత్త షెడ్యూల్‌లో అల్లు అర్జున్ ఇంట్రడక్షన్ సీన్ చిత్రీకరించనుంది. ఈ సీన్‌ను సినిమాకే హైలైట్‌గా నిలిచేలా అత్యంత భారీ స్థాయిలో ప్లాలాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ ఎపిసోడ్ కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మించినట్లు సమాచారం. అట్లీ మార్క్ స్టైలిష్ విజువల్స్, హై వోల్టేజ్ యాక్షన్‌తో బన్నీ ఎంట్రీ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ ఇచ్చేలా ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ ఇప్పటివరకు కనిపించని వైల్డ్ అండ్ రగ్గడ్ లుక్లో కనిపించనున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఇంట్రడక్షన్ సీన్‌లో ఆయన మేకోవర్, బాడీ లాంగ్వేజ్, యాక్షన్ స్టైల్ అభిమానులను ఆశ్చర్యపరిచేలా ఉంటాయని సమాచారం. 'పుష్ప' తర్వాత మరోసారి పూర్తిగా భిన్నమైన పాత్రలో బన్నీ కనిపించనున్న నేపథ్యంలో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 'రాకా'లో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ దీపికా పదుకొణె నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆమెతో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. ముగ్గురు స్టార్ హీరోయిన్లు ఒకే సినిమాలో భాగం కావడం ఈ ప్రాజెక్ట్‌కు మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, 'రాకా' కథ మాఫియా ప్రపంచం చుట్టూ తిరుగుతుందని తెలుస్తోంది. ఓ శక్తివంతమైన డాన్ జీవితాన్ని కేంద్రంగా చేసుకుని యాక్షన్, ఎమోషన్స్, థ్రిల్లింగ్ మలుపులతో కథ సాగనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అట్లీ తన గత చిత్రాల మాదిరిగానే కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు భారీ విజువల్ ట్రీట్‌ను అందించేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తోంది.

## పొలిమేర-3 లో అర్జున్

టాలీవుడ్‌లో హారర్, మిస్టరీ థ్రిల్లర్ జానర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'పొలిమేర' ఫ్రాంచైజీ ఇప్పుడు మూడో భాగంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. మొదటి భాగం ఓటీటీలో సంచలన విజయాన్ని నమోదు చేయగా, రెండో భాగం థియేటర్లలో భారీ వసూళ్లు సాధించి ఈ ఫ్రాంచైజీని మరో స్థాయికి తీసుకెళ్లింది. ఇప్పుడు 'పొలిమేర 3' పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్న వేళ, చిత్రబృందం ప్రకటించిన తాజా అప్‌డేట్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. మూడో భాగంలో సీనియర్ నటుడు, 'యాక్షన్ కింగ్' అర్జున్ సర్జా కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక ప్రమోషనల్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అర్జున్ ఎంట్రీతో 'పొలిమేర 3' కథ మరింత విస్తృతంగా, భారీ స్థాయిలో ఉండబోతుందనే సంకేతాలు కనిపిస్తున్నాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. హారర్, మిస్టరీతో పాటు యాక్షన్ అంశాలు కూడా ఈసారి మరింత బలంగా ఉండనున్నాయనే చర్చ సాగుతోంది. దర్శకుడు అనిల్ విశ్వనాథ్ తెరకెక్కించిన 'మా ఊరి పొలిమేర' ఎలాంటి అంచనాలు లేకుండా నేరుగా ఓటీటీలో విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామీణ నేపథ్యంలో మంత్రతంత్రాలు, చేతబడులు, మూఢనమ్మకాల చుట్టూ తిరిగే కథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇచ్చింది. ఈ సినిమాతో హాస్యనటుడు సత్యం రాజేష్ పూర్తి స్థాయి హీరోగా, నటుడిగా ప్రశంసలు అందుకున్నారు. ఆయన నటన, కథలోని ట్విస్టులు, థ్రిల్లింగ్ అంశాలు సినిమాను ప్రత్యేకంగా నిలబెట్టాయి. మొదటి భాగం విజయంతో ఉత్సాహంగా రెండో భాగాన్ని థియేటర్ల కోసం భారీ స్థాయిలో రూపొందించారు. 'పొలిమేర 2' విడుదల తర్వాత ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన లభించింది.

This newspaper is Owned and Published by KANTIPUDI RAVENDRA from H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072. Editor: KANTIPUDI RAVENDRA, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com.
Corporate Office: HIG 79, VNR RESIDANCY ,VENKATARAMANA COLONY, KUKATPALLY ,HYDERABAD, 500085